మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 7-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 || సంచిక: 39 Issue: 39

07 ఆగస్టు 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:00 సూర్యాస్తమయం - సా. 6:42 తిథి నవమి సా. 4:33 వరకు తరువాత దశమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం కృతిక సా. 6:38 వరకు తరువాత రోహిణి యోగం వృద్ధి మ. 12:05 వరకు కరణం గరజి సా. 4:33 వరకు వనిజ తె. 3:190 వరకు వర్జ్యం ఉ. 7:28 నుండి ఉ. 8:58 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:24 వరకు మ. 12:47 నుండి మ. 1:38 వరకు రాహుకాలం ఉ. 10:46 నుండి మ. 12:21 వరకు యమగండం మ. 3:32 నుండి సా. 5:07 వరకు గుళికాకాలం ఉ. 7:36 నుండి ఉ. 9:11 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:24 నుండి తె. 5:12 వరకు అమృత ఘడియలు సా. 4:27 నుండి సా. 5:57 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: ((౦ అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



## పెండతో పైసావసూల్!

### వ్యవసాయ వ్యర్థాలతో ఆదాయం

**23,731 కోట్లతో 'గోబర్ధన్' పథకం**

**కేంద్ర క్యాబినెట్ ఆమోదం**

న్యూఢిల్లీ: వ్యవసాయ అవశేషాలు, పశువుల వ్యర్థాలతో అదనపు ఆదాయం పొందేలా రైతుల కోసం కేంద్రం మరో పథకాన్ని తీసుకురాబోతోంది. బయోగ్యాస్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రూ.23,731 కోట్ల వ్యయంతో 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ తరువాయి 2 వ పేజీలో...

## 'ఏఐ' లేబుల్ తప్పనిసరి: కేంద్రం

డీప్‌ఫేక్ మార్ఫింగ్ చిత్రాలు, వీడియోలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కంటెంట్‌కు 'ఏఐ లేబులింగ్'ను తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.




న్యూఢిల్లీ: దీని ద్వారా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో కనిపించే కంటెంట్ అసలైనదా లేక ఏఐతో సృష్టించబడినదా అనే విషయాన్ని వినియోగదారులు సులభంగా గుర్తించే అవకాశం కలుగుతుంది. అంతేకాకుండా, సోషల్ మీడియా, డిజిటల్ వేదికలలో దర్శనమిచ్చే అశ్లీల లేదా తరువాయి 2 వ పేజీలో...

## రెస్టారెంట్లలో తాగునీళ్లు ఫ్రీ

**ఉచిత సురక్షిత నీరు అందించడం తప్పనిసరి.. మహారాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం**

**వాటర్ బాటిళ్ల విక్రయాలకు చెక్.. తెలుగు రాష్ట్రాల్లో అమలుకు డిమాండ్**



ముంబై: రెస్టారెంట్లు, హోటళ్లకు వచ్చే వినియోగదారుల హక్కులను పరిరక్షించే దిశగా మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రతి వినియోగదారునికి సురక్షితమైన ఉచిత తాగునీరు అందించడం తప్పనిసరి చేస్తూ కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ తుకారాం ముండే జారీ చేసిన ఆదేశాల ప్రకారం, ప్రతి -2 వ పేజీలో...



## అగ్ని-4 పరీక్ష విజయవంతం

**ఒడిశాలోని చాందీపూర్ నుంచి ప్రయోగం**

చాందీపూ: మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అయిన అగ్ని-4ను డీఆర్డీవో విజయ ్వంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి ఆగష్టు 6న జరిపిన అగ్ని-4 క్షిపణి పరీక్ష విజయవంతమైనట్లు కేంద్ర రక్షణ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో ప్రయోగించిన - 2 వ పేజీలో...

# యూపీఐ.. వసూల్!

**చార్జీల మోతకు లోకసభ సిగ్నల్లు**




### ఎంత చార్జీ అన్నది మాత్రం సస్పెన్స్

### కేంద్రం ఇచ్చే నోటిఫికేషన్‌తో క్లారిటీ

### ఎవరిపైనైనా, ఎంతైనా ప్రజల జేబుకే చిల్లు

దేశవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపులపై మర్చెంట్ డిస్కౌంట్ విధించేందుకు వీలుగా నిబంధనలను మార్చే ట్యాక్సేషన్ చట్టాల (సవరణ) బిల్లు, 2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

న్యూఢిల్లీ: ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే ప్రతి యూపీఐ చెల్లింపుపైనా చార్జీ పడుతుందని భావించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం యూపీఐ లావాదేవీలపై జీరో-ఎండీఆర్ విధానం అమల్లో ఉంది. డిజిటల్ చెల్లింపులను వేగంగా విస్తరించడంతో పాటు చిన్న వ్యాపారులు, వినియోగదారులపై అదనపు భారం పడకుండా ఈ విధానం కొనసాగుతోంది. తాజా సవరణ ద్వారా కొన్ని రకాల యూపీఐ లావాదేవీలకు భవిష్యత్తులో ఎండీఆర్ తరువాయి 2 వ పేజీలో...



## పంద్రాగస్టు నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**మొత్తం 1.05 కోట్ల మందికి స్మార్ట్ కార్డుల అందజేత**

**సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**అదే రోజున 119 నియోజకవర్గాల్లో పంపిణీ షురూ**

**పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**





అర్హులైన పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా మంజూరైన 1.05 కోట్ల లామినేటెడ్ ప్రజాపంపిణీ వ్యవస్థ రేషన్ కార్డులను ఆగస్టు 15 నుంచి పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి, కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

హైదరాబాద్, ఆగస్టు 6 (ఈవార్తలు): కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో తరువాయి 2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,973 |
| వెండి (కిలో): | రూ.2,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,345 |

## ఈ-రేసింగ్.. క్విడ్ ప్రోకో

### ఖజానాపై 600 కోట్ల భారం మోపే కుట్ర

**కేటీఆర్‌పై ఏసీబీ చార్జిషీట్.. 75 పేజీల నివేదిక సమర్పణ**



ఫార్ములా ఈ-రేసింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అవినీతి నిరోధక శాఖ 75 పేజీలతో కూడిన సంచలన ఛార్జిషీట్‌ను సమర్పించింది. నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ ఖజానాపై దాదాపు రూ.600 కోట్ల భారం మోపేలా నేరపూరిత కుట్ర పన్నారని ఏసీబీ ఈ ఛార్జిషీట్‌లో తీవ్ర ఆరోపణలు చేసింది.

హైదరాబాద్, ఆగస్టు 6 (ఈవార్తలు): ఈ కేసులో కేటీఆర్‌తో పాటు సీనియర్ ఐఏఎస్ అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు మరియు ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్‌లను నిందితులుగా చేర్చారు. క్యాబినెట్, ఆర్థిక, న్యాయ శాఖల అనుమతులు లేకుండానే, ఎన్నికల కోడ్‌ను సైతం పక్కన బెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఏసీబీ పేర్కొంది. టీ-హబ్‌లో కేటీఆర్ సమక్షంలో జరిగిన కీలక సమావేశమే ఈ నిర్ణయాలకు పునాదిగా మారిందని వెల్లడించింది. ముఖ్యంగా తరువాయి 2 వ పేజీలో...

## వెయ్యి కార్లతో చలో ఢిల్లీ

### బడ్జెట్ సమావేశాల్లోపు బీసీ బిల్లును ఆమోదించాలి

**లేకపోతే హస్తినకు సెగలు పుట్టిస్తాం.. సామాజిక తెలంగాణకే నా జీవితం అంకితం**

**టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టీకరణ.. సరూర్‌నగర్ 'సంకల్ప' సభలో పలు తీర్మానాలు**




సామాజిక న్యాయ తెలంగాణ సాధనే తన జీవిత లక్ష్యమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ'లో ఆమె మాట్లాడుతూ, సమాజంలోని అట్టడుగు వర్గాలకు రాజకీయ, ఆర్థిక సాధికారత కల్పించే వరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 6 (ఈవార్తలు): బీసీల కోసం తాను మాట్లాడితే కొందరు తనను అగ్రకులానికి చెందిన వ్యక్తిగా విమర్శిస్తున్నారని, అయితే పుట్టుక తన చేతిలో లేకపోయినా ఎవరి కోసం పనిచేయాలనేది తన నిర్ణయమని కవిత పేర్కొన్నారు. ప్రజాస్వామ్య మార్పుల్లో అనేక మంది అగ్రకుల సంస్కర్తలు కూడా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును వచ్చే బడ్జెట్ సమావేశాల లోపు ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించాలని కవిత డిమాండ్ చేశారు. లేకపోతే వెయ్యి -2 వ పేజీలో...

## విశ్వవాణి



మనిషి కంటి పరిణామం గురించి శాస్త్రవేత్తలు ఆసక్తికరమైన కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. మనిషి కళ్లకు మూలం, కోట్లాది సంవత్సరాల క్రితం మన పూర్వీకుల్లో ఉన్న మూడో కన్ను అయి ఉండవచ్చని తాజా అధ్యయనం సూచిస్తోంది. లక్షలాది సంవత్సరాల పరిణామంలో ఈ కన్ను అభివృద్ధి చెంది, నేడు మనుషులు సహా ఇతర వెన్నెముక కలిగిన జంతువుల్లో కనిపించే రెండు కళ్లుగా మారిందని అధ్యయనం పేర్కొంది.

## బనకచర్లకు బ్రేక్

### ఏపీ పర్యావరణ ప్రతిపాదన వెనక్కి

**ఈఏసీ నివేదికల ఆధారంగా కేంద్రం నిర్ణయం**

**పొరుగు రాష్ట్రాల ఆందోళనలు పరిగణన**



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తరువాయి 2 వ పేజీలో...



## జై తెలంగాణ అనడేం?

### ఉద్యమంలో లేనివ్యక్తి సీఎంగా!

**జయశంకర్ ఆరాటం, కేసీఆర్ పోరాటం వల్లే తెలంగాణ**

**జయశంకర్ జయంతి వేడుకల్లో సీఎంపై హరీశ్ ధ్వజం**

సిద్దిపేట, ఆగస్టు 6 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి ఈ రోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని, రేవంత్ ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అని అనలేదని మాజీమంత్రి హరీశ్ రావు విమర్శించారు. సిద్దిపేటలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట ప్రాంతంతో జయశంకర్‌కు ప్రత్యేక తరువాయి 2 వ పేజీలో...



## ఆ ఐపీఎస్‌ను అరెస్టు చేయండి

**సందీప్ సుల్తానియాపై హైకోర్టు సీరియస్**

**అరెస్టుకు హైదరాబాద్ సీపీకి ఆదేశాలు**

# రాశి ఫలాలు

7.8.2026

మేషం: చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నపటికీ సకాలంలో పూర్తిచేస్తారు. సంతానం కొన్ని విషయాలలో మీతో విభేదిస్తారు. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు తప్పవు. పాత ఋణముల ఒత్తిడి పెరుగుతుంది.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు పనిచేయవు. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానిస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో నిలకడ లోపిస్తుంది.

మిధునం: ఆర్థిక ఇబ్బందులు నుంచి కొంత వరకు బయటపడతారు. ప్రయాణాలలో నూతన పరిచయాల వలన ఆర్థిక లాభాలు పొందుతారు. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. కుటుంబ సభ్యులు నుండి వ్యతిరేకత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగమున సానుకూల వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: కొన్ని విషయాలలో అందరితో సమస్యలు కలుగుతాయి. దూర ప్రాంతాల నుంచి అందిన వార్త కొంత ఊరట కలిగిస్తుంది. ఆదాయం ఆశించిన విధంగా ఉండదు. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులుంటాయి. ఉద్యోగమున తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు.

సింహం: బంధు మిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. ఆకస్మిక ధన లాభాలు పొందుతారు. వ్యాపారమున స్నేహితుల నుంచి పెట్టుబడులు అందుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశములు అందుతాయి.

కన్య: చుట్టుపక్కల వారితో ఊహించని విభేదాలు కలుగుతాయి. ధన వ్యవహారాలలో లోటుపాట్లు తప్పవు. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది.

తుల: ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు ధన సహాయం లభిస్తుంది. కీలక వ్యవహారాలలో మిత్రుల సలహాలు తీసుకోవడం మంచిది. నూతన వ్యాపారాల ప్రారంభానికి శ్రీకారం చుడతారు. దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. నిరుద్యోగులకు ఉన్నత అవకాశములు లభిస్తాయి.

వృశ్చికం: దూర ప్రాంతాల ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేస్తారు. స్థిరాస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి గృహమున సంతోషంగా గడుపుతారు. ఉద్యోగమున ఉన్నతాధికారుల అనుగ్రహం కలుగుతుంది.

ధనస్సు: దైవ అనుగ్రహంతో ముఖ్యమైన పనులు పూర్తిచేస్తారు. వృత్తి ఉద్యోగాలలో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో నూతన ఉత్సాహంతో లాభాలు అందుకుంటారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి.

మకరం: కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరం అవుతాయి. కుటుంబ వాతావరణం మరింత చికాకు పరుస్తుంది. ఉద్యోగస్తులు అధికారులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు.

కుంభం: ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం లభిస్తుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలలో సమర్ధవంతంగా నిర్వహించి లాభాలు పొందుతారు.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయ సహకారములు అందుతాయి. ఇంటా బయట శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. నూతన వ్యాపారాలు విజయవంతంగా ప్రారంభిస్తారు. నిరుద్యోగులకు అప్రయత్నంగా నూతన అవకాశాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ప్రయాణాలలో మరింత జాగ్రత్త వహించాలి.

# యూపీఐ.. వసూల్!

**మొదటి పేజీ తరువాయి**




విధించేలా చట్టపరమైన అడ్డంకిని తొలగించే అవకాశం ఏర్పడింది. అయితే ఎంత చార్జీ విధించాలి, ఏ లావాదేవీలకు వర్తించాలి, ఎప్పటి నుంచి అమలు చేయాలి వంటి అంశాలను బిల్లు ప్రస్తుతం నిర్దేశించలేదు. సాధారణ యూపీఐ వినియోగదారులకు ఇప్పటికిప్పుడు ఎలాంటి మార్పు ఉండదు. భవిష్యత్తులో ప్రభుత్వం, ఆర్‌బీఐ నిర్ణయించే నిబంధనల ఆధారంగానే నిర్దిష్ట వ్యాపార లావాదేవీలపై చార్జీలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

### ఎండీఆర్ అంటే..

మర్చంట్ డిస్కౌంట్ రేట్ అనేది డిజిటల్ చెల్లింపులను ప్రాసెస్ చేసే బ్యాంకులు లేదా పేమెంట్ సేవల సంస్థలకు వ్యాపారులు చెల్లించే సేవా రుసుము. ఈ రుసుము ద్వారా లావాదేవీల ప్రాసెసింగ్, సెటిల్‌మెంట్, సర్వర్ నిర్వహణ, సైబర్ భద్రత, మోసాల నివారణ, క్లౌడ్ సేవలు, కస్టమర్ సపోర్ట్, వివాదాల పరిష్కారం వంటి ఖర్చులు భరిస్తారు. డిసెంట్రో సంస్థ అభిప్రాయం.. వార్షిక టర్నోవర్ రూ.50 కోట్లకు పైబడిన వ్యాపారులకు 0.3% నుంచి 0.6% వరకు ఎండీఆర్ విధించే అవకాశం ఉంది. యూపీఐ నిర్వహణ వ్యయాలను భర్తీ చేసే స్థాయిలో చార్జీ ఉంటుందని అంచనా. ప్రస్తుత చర్చల ప్రకారం.. రూ.2,000కు పైబడిన యూపీఐ చెల్లింపులకు, పెద్ద వ్యాపార సంస్థలకు జరిగే చెల్లింపులపై మాత్రమే చార్జీ ఉండనుంది. చిన్న వ్యాపారులు, చిన్న మొత్తాల లావాదేవీలు యథావిధిగా ఉచితంగానే కొనసాగే అవకాశం ఉంది.

### ఆర్బీఐ గవర్నర్ ఏమంటున్నారంటే..

ఎండీఆర్ చెల్లించాల్సింది వ్యాపార సంస్థ. నిబంధనల ప్రకారం వినియోగదారుడిపై నేరుగా అదనపు రుసుముగా వేయడం అనుమతించకపోవచ్చు. అయితే పెద్ద వ్యాపార సంస్థలు ఆ అదనపు వ్యయాన్ని వస్తువుల ధరలు పెంచడం, డిస్కౌంట్లు తగ్గించడం, సర్వీస్ చార్జీల్లో కలపడం వంటి మార్గాల్లో పరోక్షంగా వినియోగదారులపైకి మళ్లించే అవకాశం ఉంటుంది. సరఫరా గొలుసులో ఖర్చులు పెరిగితే, వాటి ప్రభావం టోకు వ్యాపారులు, చిన్న వ్యాపారులపై పడే అవకాశం ఉంది. వారు కూడా చివరకు తమ మార్జిన్‌ను కాపాడుకునేందుకు ధరలు పెంచితే, ఆ భారం వినియోగదారుడికే చేరుతుంది. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కూడా ఇదే భావనను వ్యక్తం చేశారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు అయ్యే ఖర్చును చివరికి ఎవరో ఒకరు భరించాల్సిందే అని, అది ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా ఆర్థిక వ్యవస్థ ద్వారా వినియోగదారులకే చేరుతుందని పేర్కొన్నారు.

**యూపీఐ లావాదేవీల్లో పరిస్థితి (2025-26లో..):**

**24,000 కోట్లకు పైగా యూపీఐ లావాదేవీలు**

**మొత్తం విలువ రూ.314 లక్షల కోట్లు**

**వాటిలో.. రూ.2,000కు మించిన లావాదేవీలు కేవలం 4% మాత్రమే.**

**ఈ 4% విలువ మొత్తం యూపీఐ లావాదేవీల్లో మూడింట రెండొంతులు.**

**అంటే లావాదేవీల సంఖ్య తక్కువైనా, డబ్బు పరంగా వాటి విలువ అత్యధికం.**

# ఆ ఐఏఎస్‌ను అరెస్టు చేయండి

**సందీప్ సుల్తానియాపై హైకోర్టు సీరియస్**

**అరెస్టుకు హైదరాబాద్ సీపీకి ఆదేశాలు**

హైదరాబాద్, ఆగస్టు 6 (ఈవార్తలు): తెలంగాణ క్యాడర్ సీనియర్ ఐఏఎస్ సందీప్ సుల్తానియాకు హైకోర్టులో బిగ్ షాక్ తగిలింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు చెల్లించాల్సిన నిధుల జాప్యంపై నమోదైన కేసులో, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసినందుకు ఆయనపై కోర్టు ధిక్కరణ చర్యల కింద అరెస్ట్ వారెంట్ జారీ చేస్తూ హైకోర్టు అత్యంత కీలక ఆదేశాలు ఇచ్చింది. న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా ప్రవర్తించిన అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని పేర్కొంది. ఈ వ్యవహారాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించిన హైకోర్టు, శుక్రవారం ఉదయం నాటికి ఐఏఎస్ అధికారి సందీప్ సుల్తానియాను అరెస్ట్ చేసి నేరుగా తమ ముందు హాజరు పరచాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌కు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే, ఒకవేళ సదరు అధికారి తాను స్వచ్ఛందంగా, వ్యక్తిగతంగా కోర్టు విచారణకు హాజరవుతానని స్పష్టమైన హామీ ఇస్తే మాత్రం రూ. 5 వేల పూచీకత్తుపై ఆయనను విడుదల చేయవచ్చని న్యాయస్థానం తన ఉత్తర్వుల్లో మినహాయింపునిచ్చింది.

# వెయ్యి కార్లతో చలో ఢిల్లీ



**మొదటి పేజీ తరువాయి**

కార్లతో 'చలో ఢిల్లీ' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ కొట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకువస్తుందని కవిత అన్నారు. గ్రామస్థాయి నుంచి అన్ని వర్గాల ప్రజలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా తమ పార్టీ ఉద్యమిస్తుందని తెలిపారు. వచ్చే ఐదు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి సామాజిక న్యాయ ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని వెల్లడించారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయమైన సామాజిక తెలంగాణను సాకారం చేయడమే తన లక్ష్యమని కవిత పేర్కొన్నారు. భౌగోళిక తెలంగాణ సాధించిన తర్వాత సామాజిక తెలంగాణ కోసం పోరాటం అవసరమని జయశంకర్ చెప్పిన మాటలే తనకు స్ఫూర్తిగా నిలిచాయని వెల్లడించారు. సభలో పాల్గొన్న పార్టీ నాయకులు, ప్రతినిధులతో కలిసి కవిత సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం ప్రతిజ్ఞ చేయించారు. అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక స్వావలంబన కల్పించే వరకు అంకితభావంతో ఉద్యమం కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

### కీలక తీర్మానాలకు ఆమోదం

సభలో కవిత పలు తీర్మానాలను ప్రతిపాదించగా సభికులు ఆమోదించారు.

- బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్త ఉద్యమం.
- మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులకు భారతరత్న పురస్కారం.
- ప్రొఫెసర్ జయశంకర్‌కు పద్మవిభూషణ్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరడం, ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు.
- ఎస్సీ, ఎస్టీ నిధులను వారి అభ్యున్నతికే వినియోగించడం.
- ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం.
- ఆదివాసీలకు అడవులపై సంపూర్ణ హక్కులు.
- మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్.
- ముస్లింలు, సిక్కులు, క్రైస్తవుల ఆర్థిక సాధికారతకు చర్యలు.
- ట్రాన్స్‌జెండర్లు, వికలాంగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ చర్యలు.

# అగ్ని-4 పరీక్ష విజయవంతం

**మొదటి పేజీ తరువాయి**

ఈ క్షిపణి నిర్ణీత లక్ష్యాన్ని చేరుకుందని తెలిపింది. నిర్వహణా సంబంధమైన, అలాగే సాంకేతికపరమైన అన్ని అంచనాల్ని అందుకుందని వివరించింది. భారీ ఫ్యుయెల్ రాకెట్ మోటార్ కలిగిన ఈ క్షిపణిని రెండు దశల్లో.. అంటే భూ ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించవచ్చు. ఇది 4,000 కిలోమీటర్ల లక్ష్యాన్ని చేరుకోగలదు. ఇది భారీ పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో), ఎస్‌ఎఫ్‌సీ కలిపి అగ్ని-4 క్షిపణుల్ని తయారు చేస్తున్నాయి. దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో అగ్ని క్షిపణుల్ని తయారు చేస్తున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో అగ్ని ప్రైమ్, అగ్ని-3 క్షిపణుల్ని కూడా భారత్ విజయవంతంగా ప్రయోగించింది.

# ఈ-రేసింగ్.. క్విడ్ ప్రోకో

**మొదటి పేజీ తరువాయి**

ప్రమోటర్ సంస్థ అనుబంధ కంపెనీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి రూ.44 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు అందాయని, దానికి ప్రతిఫలంగానే ఈ రేసింగ్ బాధ్యతలు అప్పగించారనే క్విడ్ ప్రోకో కోణాన్ని ఏసీబీ బయటపెట్టింది. ఎలాంటి అధికారిక ఒప్పందం లేకపోయినా హెచ్‌ఎండీఏ నిధుల నుంచి రూ.46.82 కోట్లు చెల్లించారని, రాబోయే సీజన్లకు సంబంధించిన రూ.600 కోట్ల ఆర్థిక భారాన్ని ప్రభుత్వంపై మోపేలా వ్యవహరించారని తెలిపింది. ఈ క్రమంలో కేటీఆర్‌పై ఐపీసీ 409 (నమ్మకద్రోహం), 120బీ (నేరపూరిత కుట్ర)తో పాటు అవినీతి నిరోధక చట్టంలోని పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

# బనకచర్లకు బ్రేక్

**మొదటి పేజీ తరువాయి**

తెలియజేశారు. కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఈఏసీ) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది. ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది.

# పెండతో పైసావసూల్!

**మొదటి పేజీ తరువాయి**

బయోఎనర్జీ పథకానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2035-36 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశీయంగా 'కంప్రెస్డ్ బయోగ్యాస్' (సీబీజీ) ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రైతుల నుంచి సేకరించే పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు డిమాండ్ పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి. సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక కొనుగోలు విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే సీబీజీకి ప్రతి ఎంఎంబీటీయూకు రూ.2,110 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. దీనివల్ల ఉత్పత్తిదారులకు దీర్ఘకాలిక ఆదాయ భరోసా లభించనుంది. కొత్తగా ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లకు రోజుకు ఒక టన్ను ఉత్పత్తి సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు మూలధన సాయం అందించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. ముడి పదార్థాల సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించనుంది. సీబీజీ ప్లాంట్లను గ్యాస్ పైప్‌లైన్లతో అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక వసతులకు మద్దతు ఇవ్వనున్నారు. ఎంఎస్‌ఎంఈ ఆధారిత ప్రాజెక్టులకు రుణ హామీ పథకం కూడా అమలు చేయనున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.



# జై తెలంగాణ అనడేం?

**మొదటి పేజీ తరువాయి**

అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్న ఆయన... కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ కల సాకారమైందని వ్యాఖ్యానించారు. గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 380 టీఎంసీల నీటిని హక్కుగా సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాకపోగా సాధించుకున్న అనుమతులను కూడా రద్దు చేసేలా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతోందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పునఃసమీక్షించి రద్దు చేయాలనే అంశం అజెండాలోకి రావడం దుర్మార్గమన్నారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుతో పాటు సమ్మక్క-సారక్క ప్రాజెక్టు 47 టీఎంసీల క్లియరెన్స్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఏపీ సర్కార్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్‌ఎంబీ అజెండాను మార్పించాలని, లేని పక్షంలో ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# 'ఏఐ' లేబుల్ తప్పనిసరి: కేంద్రం

**మొదటి పేజీ తరువాయి**

డీప్‌ఫేక్ కంటెంట్‌పై చర్యలు తీసుకునే నిబంధనలను కేంద్ర ప్రభుత్వం మరింత పటిష్ఠం చేసింది. సంబంధిత ఫిర్యాదులు వచ్చిన వెంటనే సామాజిక మాధ్యమ వేదికల నుండి అభ్యంతరకర చిత్రాలు లేదా వీడియోలను తొలగించేందుకు ఇది వరకు ఉన్న 36 గంటల గడువును ఏకంగా 3 గంటలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. డిజిటల్ మాధ్యమాల్లో సైబర్ నేరాలు, ప్రాధాన్యత కలిగిన వ్యక్తులు, సాధారణ పౌరుల ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను త్వరితగతిన నిరోధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నూతన మార్గదర్శకాలను అమల్లోకి తెచ్చింది.

# పంద్రాగస్టు నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**మొదటి పేజీ తరువాయి**

రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) సమన్వయంతో జిల్లా యంత్రాంగం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారుల జాబితాల ఖరారు, కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాటు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, ప్రచారం, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తూ, ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

### స్మార్ట్ కార్డులపై అనేక భద్రతా ఫీచర్లు

రేషన్ కార్డులను ఆధునిక టెక్నాలజీతో రూపొందించారు. పీవీసీ మెటీరియల్‌తో తయారు చేసిన లామినేటెడ్ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశారు. వాటర్‌ప్రూఫ్‌గా, క్రెడిట్ కార్డు పరిమాణంలో ఉండే ఈ స్మార్ట్ కార్డులు ఎక్కువ కాలం ఉపయోగపడేలా తయారు చేశారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. రేషన్ లబ్ధిదారుల తుది జాబితాల పరిశీలన, ఈ-కేవైసీ పూర్తి చేయడం, కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాటు వంటి అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

# రెస్టారెంట్లలో తాగునీళ్లు ఫ్రీ

**మొదటి పేజీ తరువాయి**

హోటల్, రెస్టారెంట్‌లో "ఉచిత సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంది" అనే బోర్డును వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంతో వినియోగదారులను బలవంతంగా ప్యాకేజ్డ్ వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయించే ధోరణికి అడ్డుకట్ట పడనుంది. ఇకపై కస్టమర్లు కోరినప్పుడు సురక్షితమైన తాగునీటిని ఉచితంగా అందించాల్సి ఉంటుంది. ఉచిత తాగునీరు అందించకపోయినా, సంబంధిత బోర్డులను ఏర్పాటు చేయకపోయినా ఆయా హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీఏ కమిషనర్ హెచ్చరించారు. కొన్ని రెస్టారెంట్లలో ఉచిత నీరు ఇవ్వకుండా ఖరీదైన ప్యాకేజ్డ్ వాటర్ బాటిళ్లను టేబుల్‌పై ఉంచి బిల్లులో చేర్చడం లేదా నాణ్యత లేని నీటిని అందించడం వంటి ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సామాజిక మాధ్యమాల్లో పలువురు స్వాగతిస్తున్నారు. ఇదే తరహా నిబంధనలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. రెస్టారెంట్లలో ఉచిత సురక్షిత తాగునీటిని తప్పనిసరి చేయాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు, ఫుడ్ సేఫ్టీ అధికారులను కోరుతూ సోషల్ మీడియాలో ఉద్యమం మొదలైంది.

# శాశ్వత నిర్మాణాలే చేపట్టాలి

**అధికారులపై ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం**

మెట్‌పల్లి, ఆగస్టు 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణాభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోనని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ స్పష్టం చేశారు. మెట్‌పల్లి బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులను గురువారం పరిశీలించిన ఆయన, డ్రైనేజీ సామర్థ్యానికి తగ్గట్టుగా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సుమారు ఏడున్నర అడుగుల వెడల్పు ఉన్న ప్రధాన డ్రైనేజీకి బదులుగా కేవలం మూడు అడుగుల పైపులు ఏర్పాటు చేయడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అవసరమైతే నిర్మాణ ప్రణాళికను వెంటనే సవరించి, డ్రైనేజీ సామర్థ్యానికి అనుగుణంగా పెద్ద పైపులు ఏర్పాటు చేయాలని సూచించారు. తాత్కాలిక పనులకు బదులుగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. నాణ్యతలేని పనులు జరిగితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే సంజయ్ హెచ్చరించారు.

# టెట్‌కు ఎస్టీయూ స్టడీ మెటీరియల్

**కలెక్టర్, డీఈవో చేతుల మీదుగా ఆవిష్కరణ**

జగిత్యాల, ఆగస్టు 6 (ఈవార్తలు): స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) స్టడీ మెటీరియల్‌ను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా విద్యాధికారి (డీఈవో) కే. రాము గురువారం తమ కార్యాలయాల్లో ఆవిష్కరించారు. 2028 ఆగస్టు 31లోపు ఉపాధ్యాయులందరూ టెట్ ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి నేపథ్యంలో ఎలాంటి లాభాపేక్ష లేకుండా విషయ నిపుణులతో ఈ మెటీరియల్ రూపొందించడం అభినందనీయమని డీఈవో పేర్కొన్నారు. జిల్లాలో ఇంకా 522 మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాల్సి ఉందని, ఈ మెటీరియల్ వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులందరూ టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్, డీఈవో ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్, ప్రధాన కార్యదర్శి పాలెపు శివరామకృష్ణ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీర్ణంచ రవీందర్, జిల్లా కోఆర్డినేటర్ చిప్ప సత్యనారాయణ, జిల్లా సైన్స్ ఆఫీసర్ మచ్చ రాజశేఖర్, వంశీ, కోరుట్ల మండల ప్రధాన కార్యదర్శి అన్నం మహేష్ పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి: దావ వసంత

జగిత్యాల, ఆగస్టు 6 (ఈవార్తలు): తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జగిత్యాల పట్టణంలోని ఆయన విగ్రహానికి జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ గురువారం బీఆర్ఎస్ నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జయశంకర్ వ్యక్తి కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ఆయన ఆశయాలను ప్రజా ఉద్యమంగా మలిచి, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని, జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగితేనే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు వొళ్లెం మల్లేశం, కౌన్సిలర్ కోరుగంటి రాము, తోట హరీష్, శీలం ప్రవీణ్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 5 వేల లంచం తీసుకుంటూ చిక్కిన జీపీఓ

**ఏసీబీ వలలో ఆత్మకూర్ గ్రామపాలన అధికారి రాజేశ్**

మెట్‌పల్లి, ఆగస్టు 6 (ఈవార్తలు): మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన గ్రామపాలన అధికారి (జీపీఓ) రాజేష్ రూ.5 వేల లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. ఆత్మకూర్ గ్రామానికి చెందిన ఓ రైతు తన పట్టాదారు పాస్‌బుక్‌లో తప్పుగా నమోదైన పేరును సరిచేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఆ దరఖాస్తును పరిష్కరించేందుకు జీపీఓ రాజేష్ రూ.5 వేల లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు వల పన్ని, బాధితుడి నుంచి రూ.5 వేల లంచం తీసుకుంటున్న సమయంలో జీపీఓ రాజేష్‌ను పట్టుకున్నారు. అనంతరం సంబంధిత ఫైల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి తెలిపారు. ఏసీబీ అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

# రౌడీ, హిస్టరీ షీటర్లపై నిరంతర నిఘా

**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

జగిత్యాల, ఆగస్టు 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, అనుమానిత నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లు, సస్పెక్ట్ షీట్ల నిర్వహణతో పాటు తరచూ నేరాలకు పాల్పడే వ్యక్తులపై తీసుకుంటున్న చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీ, హిస్టరీ షీట్లలో ఉన్న వ్యక్తుల ప్రవర్తన, కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశమున్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాత నేరస్థులు తిరిగి నేరాలకు పాల్పడకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ, హిస్టరీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తులు, అల్లర్లలో ప్రమేయం ఉన్నవారిని ప్రతి నెల పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపడంతో పాటు, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. సమీక్ష సమావేశంలో డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రవికుమార్, సీఐలు కరుణాకర్, సుధాకర్, రామ్ నరసింహారెడ్డి, రాజ్‌కుమార్, సురేష్‌బాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# జయశంకర్‌కు విశ్వబ్రాహ్మణుల ఘన నివాళి

మల్యాల, ఆగస్టు 6 (ఈవార్తలు): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా మల్యాల మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన అందించిన విశిష్ట సేవలను కొనియాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంత బలం చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్యాల గ్రామపంచాయతీ సర్పంచ్ బొట్ల జయ, ఉపసర్పంచ్ కటకం వినయ్, ఈఓ శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.

# కాక్రోచ్.. 'క్యా బోలీ పబ్లిక్'?

**కొత్త ఉద్యమానికి సీజేపీ శ్రీకారం**

**దేశవ్యాప్తంగా ప్రజలతో నేరుగా సంభాషణ**

**ఫీజుల భారం తగ్గించాలని డిమాండ్**




శంభాజీనగర్: జంతర్‌మంతర్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీక్‌లపై చేపట్టిన ఆందోళనల తర్వాత దేశవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్ణయించింది. సెప్టెంబర్ నుంచి 'క్యా బోలీ పబ్లిక్?' పేరుతో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే ప్రకటించారు. ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ కోర్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత దిప్కే మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. దేశంలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిందని దిప్కే విమర్శించారు. మొదటి తరగతి ప్రవేశానికే రూ.లక్షల ఫీజులు, భారీ విరాళాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్యతరగతి, ఉద్యోగ కుటుంబాలు పిల్లలను చదివించడం భారంగా మారిందన్నారు. ఉన్నత విద్య, కోచింగ్ పేరుతో తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్య ప్రతి ఒక్కరి హక్కని, అది అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాలపై జరిగిన ఆందోళనల్లో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారని దిప్కే గుర్తుచేశారు. దేశంలో నిరుద్యోగం కూడా అత్యంత కీలక సమస్యగా మారిందన్నారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. అధికారాన్ని ప్రశ్నించే స్వతంత్ర పాత్రను మీడియా పోషించాలని కోరారు. సీజేపీ ఎన్నికల్లో పోటీ చేయదని, ప్రజల హక్కుల పరిరక్షణ, పాలనలో సంస్కరణల కోసం ఒత్తిడి తెచ్చే శక్తిగా పనిచేస్తుందని దిప్కే స్పష్టం చేశారు.

# మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్ ప్రారంభం

**హైదరాబాద్ కేంద్రంగా షురూ.. భారత్‌లో మైక్రోసాఫ్ట్‌కు ఇది నాలుగో సెంటర్**




హైదరాబాద్, ఆగస్టు 6 (ఈవార్తలు): ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, భారత్‌లో తన క్లౌడ్ సేవలను మరింత విస్తరించింది. హైదరాబాద్ కేంద్రంగా "ఇండియా సౌత్ సెంట్రల్" పేరుతో తన నూతన క్లౌడ్ రీజియన్‌ను గురువారం ప్రారంభించింది. ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో దేశంలో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎంటర్‌ప్రైజ్ సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ వెల్లడించింది. తెలంగాణలో ఏర్పాటైన ఈ నూతన రీజియన్ ద్వారా వినియోగదారులు తమ డేటాను స్థానికంగానే భద్రపరుచుకోవచ్చు. దీనివల్ల అత్యున్నత భద్రతతో పాటు వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే పూణె, చెన్నై, ముంబై నగరాల్లో మైక్రోసాఫ్ట్‌కు క్లౌడ్ రీజియన్లు ఉండగా, తాజా విస్తరణతో భారత్‌లో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ నెట్‌వర్క్ కలిగిన సంస్థగా మైక్రోసాఫ్ట్ నిలిచింది. సేవల్లో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ఉండేందుకు వీలుగా ఈ కేంద్రంలో మూడు అవైలబిలిటీ జోన్‌లను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, 2030 నాటికి నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించే లక్ష్యంతో ఇందులో "జీరో-వాటర్ కూలింగ్" సాంకేతికతను వినియోగిస్తున్నారు. అదానీ గ్రూప్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పీబీ పే వంటి ప్రముఖ భారతీయ సంస్థలు ఇప్పటికే ఈ హైదరాబాద్ రీజియన్ సేవలను వినియోగించుకుంటున్నాయి. భారత్‌లో డిజిటల్, ఏఐ మౌలిక సదుపాయాల కోసం మైక్రోసాఫ్ట్ ప్రకటించిన 20.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులలో భాగంగా ఈ నూతన రీజియన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికతతో విలువైన ఫలితాలను సాధించాలంటే, డేటాకు సమీపంలో నమ్మకమైన మౌలిక సదుపాయాలు ఉండటం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# మాకేమైనా అయితే నాన్నదే బాధ్యత

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌పై కుమారుడు సంతోష్ గౌడ్ ఆరోపణలు**

**ప్రేమ పెళ్లిని అడ్డుకుంటున్నారని వెల్లడి**

**రూపారెడ్డి కుమార్తెతో నిశ్చితార్థం జరిగిందన్న సంతోష్**

**40 మందితో దాడి చేయించారని ఆరోపణ**



రాజేంద్రనగర్, ఆగస్టు 6 (ఈవార్తలు): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌పై ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. తాను ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకోవడాన్ని తన తండ్రి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమకు ఏదైనా జరిగితే అందుకు ప్రకాశ్ గౌడ్‌నే బాధ్యుడిగా భావించాలని అన్నారు. మణికొండకు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు రూపారెడ్డి కుమార్తెను తాను ప్రేమిస్తున్నానని సంతోష్ గౌడ్ తెలిపారు. ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పగా తొలుత కుటుంబ సభ్యులు అంగీకరించలేదని చెప్పారు. తర్వాత తన ఇష్టప్రకారం పెళ్లి చేసుకోవచ్చని చెప్పడంతో గత నెలలో నిశ్చితార్థం చేసుకున్నానని వెల్లడించారు. అప్పటి నుంచి రూపారెడ్డి ఇంట్లోనే ఉంటున్నట్లు తెలిపారు. తమను అంతం చేయాలనే ఉద్దేశంతో దాదాపు 40 మందితో తన కాబోయే అత్త ఇంటిపై దాడి చేయించారని సంతోష్ గౌడ్ ఆరోపించారు. ఈ ఘటన వెనుక తన తండ్రి ఉన్నారని అన్నారు. దాడి విషయాన్ని పోలీసులకు తెలియజేసినా ఫిర్యాదును సరిగా స్వీకరించలేదని సంతోష్ గౌడ్ ఆరోపించారు. నార్సింగ్ పోలీసులు రాజకీయ ఒత్తిళ్లతో తమపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. మీడియా ముందుకు రావడంతో తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఇంకా స్పందించలేదు.

**వాడెవడో నాకు సంబంధం లేదు: ప్రకాశ్ గౌడ్**

ప్రేమ వివాహం చేసుకోవాలనుకున్న తమను తన తండ్రి చంపేందుకు ప్రయత్నిస్తున్నాడని.. తన తండ్రి నుండి ప్రాణహాని ఉందంటూ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కుమారుడు సంతోష్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశాడు. ఈ ఆరోపణల నేపథ్యంలో ప్రేమ వివాహం చేసుకునేందుకు సిద్ధమైన తన కొడుకు సంతోష్ గౌడ్‌పైఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వాడెవడో నాకు సంబంధం లేదు.. ఆ విషయం గురించి నేను మాట్లాడదలచుకోలేదు. సమయం వచ్చినప్పుడు మాట్లాడుతానంటూ చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# క్లాస్‌లోనే కాటేసిన పాము.. విద్యార్థి మృతి

నారాయణపేట, ఆగస్టు 6 (ఈవార్తలు): తెలంగాణలోని నారాయణపేట జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదిలోనే విద్యార్థి పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఏక్లాస్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రంజిత్ (8) అనే బాలుడు మూడో తరగతి చదువుతున్నాడు. గురువారం తరగతి గదిలో పాఠాలు వింటున్న సమయంలో రంజిత్‌ను పాము కాటువేసింది. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే అప్రమత్తమై, బాలుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రంజిత్ మృతి చెందాడు. కళ్లముందే ఆడుతూ పాడుతూ పాఠశాలకు వెళ్లిన కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ హృదయవిదారక ఘటనతో ఏక్లాస్‌పూర్ గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పాముల సంచారం అధికంగా ఉంటుంది.

# తెలంగాణ విద్యార్థులకు వీసాలు పెంచండి

**అమెరికా రాయబారికి రేవంత్ వినతి**

**సానుకూలంగా స్పందించిన అమెరికా**



హైదరాబాద్, ఆగస్టు 6 (ఈవార్తలు): హెచ్-1బీ వీసా నిబంధనలను సులభతరం చేయాలని, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే తెలంగాణ విద్యార్థుల కోసం వీసా స్లాట్ల సంఖ్యను పెంచాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి ఏటా అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లే తెలంగాణ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నందున, వారికి సకాలంలో వీసా అపాయింట్‌మెంట్లు లభించేలా దరఖాస్తు ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. అక్కడ చదువుకుంటున్న విద్యార్థుల భద్రత, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే, హెచ్-1బీ నిబంధనల్లో ఏవైనా మార్పులు చేపట్టేటప్పుడు ఆ సమాచారాన్ని ముందుగా తెలియజేయాలని, తద్వారా అమెరికాలో పనిచేస్తున్న తెలంగాణ నిపుణుల ప్రయోజనాలను కాపాడవచ్చని ఆయన సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో వివరించారు. ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), లైఫ్ సైన్సెస్, ఫార్మా, స్టార్టప్‌ల వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా కంపెనీలను ఆయన ఆహ్వానించారు. హైదరాబాద్‌లో తమ అంతర్జాతీయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు తెలంగాణలోని విద్యాసంస్థలతో కలిసి సంయుక్తంగా పరిశోధన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ప్రోత్సహించాలని విన్నవించారు. సుమారు అరగంటకు పైగా సాగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తులపై రాయబారి సెర్గియో గోర్ సానుకూలంగా స్పందించారు. అమెరికాలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న భారతీయ భాషల్లో తెలుగు ఒకటిగా ఉందని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

# నైనీ గని నుంచి టీజీకి తొలి బొగ్గు రైలు

మంచిర్యాల, ఆగస్టు 6 (ఈవార్తలు): తెలంగాణ ఇంధన రంగంలో సింగరేణి మరో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి బొగ్గుతో నిండిన తొలి రైల్వే వ్యాగన్ విజయవంతంగా తెలంగాణకు చేరుకుంది. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (ఎస్‌టీపీపీ)కు ఈ తొలి బొగ్గు రైలు చేరుకోవడం సింగరేణి 136 ఏళ్ల చరిత్రలో ఒక అరుదైన ఘట్టంగా నిలిచింది. ఈ రైలులో మొత్తం 59 వ్యాగన్ల ద్వారా సుమారు 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు రవాణా చేశారు. బొగ్గుతో కూడిన రైలు థర్మల్ విద్యుత్ కేంద్రానికి చేరుకోగానే సింగరేణి ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు ఈ విజయాన్ని సింగరేణి చరిత్రలో కొత్త అధ్యాయంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యం, అధికారులు, కార్మికులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నైనీ గని నుంచి బొగ్గు తెలంగాణకు చేరుకోవడం రాష్ట్ర ఇంధన భద్రతకు కీలక మైలురాయి అని పేర్కొన్నారు.

## CHANGE OF NAME

I, **KOPPU JAYASUDHA** W/O. KOPPU MUNENDAR (Old Name), Age:45 yrs, R/o. H.No. 1-3-233, Krishna Nagar, Jagtial, Telangana, have changed my name as **GUDURI JAYASUDHA**, W/O. KOPPU MUNENDAR (New Name).

Both names, **KOPPU JAYASUDHA** and **GUDURI JAYASUDHA**, belong to one and the same person, i.e., myself. Henceforth, I shall be known as **GURUDI JAYASUDHA** for all official purposes.

## జయశంకర్‌కు వడ్రంగుల ఘన నివాళి

వేములవాడ అర్బన్, ఆగస్టు 6 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో శ్రీ రాజరాజేశ్వర వడ్రంగుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలి దశ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పోషించిన పాత్ర చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సనుగుల సత్యం చారి, వేములవాడ సంఘం అధ్యక్షుడు దర్శనాల రాములు, వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు చందనం రవీందర్ చారి, కసర్ల కరుణాకర్, సంకోజి రామలింగం, దర్శనాల రాజు, వీరచారి, శ్రీరాములు, రమేష్, కసర్ల రాజేశం, సనుగుల రవి, చంద్రగిరి నాగరాజు, వేములవాడ ఆంజనేయులు, యశోద, మురళి తదితర సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పార్కిన్సన్స్ బాధితుడికి ఆది రూ.7.50 లక్షల ఎల్వోసీ

వేములవాడ అర్బన్, ఆగస్టు 6 (ఈవార్తలు): సిరిసిల్ల పట్టణంలోని ముష్టిపల్లికి చెందిన జడల సునీల్ కుమార్ పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతుండగా, ఆయనకు అత్యవసర వైద్య చికిత్స అందించేందుకు తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ చూపారు. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న వెంటనే నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ప్రత్యేక వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. అలాగే వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.7.50 లక్షల విలువైన చికిత్స అనుమతి పత్రం (ఎల్ఓసీ) మంజూరు చేయించారు. ప్రభుత్వం నుంచి సకాలంలో వైద్య సహాయం అందడంతో బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## లైబ్రరీకి 50 పుస్తకాల విరాళం

వేములవాడ అర్బన్, ఆగస్టు 6 (ఈవార్తలు): తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ కె. జయశంకర్ జయంతిని పురస్కరించుకుని సిరిసిల్ల అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయంలో పుస్తక విరాళ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శారీరక విద్యా సంచాలకులు జి. శ్రీధర్‌రావు సతీమణి శ్రీమతి జి. నీలిమ శ్రీధర్ గ్రంథాలయానికి 50 విలువైన పుస్తకాలను విరాళంగా అందజేశారు. వీటిలో సాధారణ విజ్ఞానం, నిఘంటువులు తదితర పుస్తకాలు ఉన్నాయి. ఈ పుస్తకాలు విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవడంలో, భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో, విజ్ఞానాన్ని విస్తరించుకోవడంలో ఉపయోగపడనున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. శంకర్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గ్రంథాలయానికి పుస్తకాలను అందజేసిన శ్రీమతి జి. నీలిమ శ్రీధర్‌ను అభినందించారు. పుస్తక దానం అత్యున్నత దానమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు గ్రంథాలయ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రంథాలయ బాధ్యులు డాక్టర్ కె.వై. కరుణ మాట్లాడుతూ, దాతకు కృతజ్ఞతలు తెలియజేసి, ఈ పుస్తకాలు విద్యార్థుల విద్యాభివృద్ధికి, పోటీ పరీక్షల సన్నద్ధతకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సమన్వయకర్త డాక్టర్ ఎ. ప్రసాద్, అధ్యాపకులు నిర్మల, శివాని, కళాశాల అధ్యాపక బృందం పాల్గొని దాతృత్వాన్ని అభినందించారు.

## ఆగస్టు 10తో సర్ ముగింపు

వేములవాడ అర్బన్, ఆగస్టు 6 (ఈవార్తలు): ప్రత్యేక ఓటరు నమోదు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువు ఆగస్టు 10తో ముగియనున్న నేపథ్యంలో, అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోపు తమ ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి కే.ఎస్.బీ. కుమారి విజ్ఞప్తి చేశారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటరు నమోదు ప్రక్రియను సంపూర్ణంగా, పారదర్శకంగా, పటిష్ఠంగా నిర్వహించేందుకు చివరి రోజు వరకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. వేములవాడ నియోజకవర్గంలో మొత్తం 2,29,132 మంది ఓటర్లలో ఇప్పటివరకు 2,01,995 మంది నమోదు ప్రక్రియ పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఇది 88.16 శాతం నమోదుకు సమానమని పేర్కొన్నారు. ఇంకా నమోదు చేసుకోని అర్హులైన ఓటర్లు సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించి అవసరమైన పత్రాలు సమర్పించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వి. నిత్యానందరావు, బీఆర్ఎస్ నుంచి పొలాస నరేందర్, బీజేపీ నుంచి పిన్నింటి హన్మాండ్లు, టీడీపీ నుంచి చింతలకోటి రామస్వామి గౌడ్, ఎన్నికల సీనియర్ సహాయకుడు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల జేఎన్టీయూలో శిక్షణ విజయవంతం

రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 6 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్‌టీయూహెచ్ కళాశాలలో సోహం మానవ వికాస విద్యాసంస్థ ఆధ్వర్యంలో, ఏఎండీ సంస్థ సహకారంతో శిక్షకులకు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో రోబోటిక్స్ శిక్షణ అందించనున్న విద్యార్థులను శిక్షకులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో మొత్తం 186 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 96 మంది విద్యార్థినులు, 90 మంది విద్యార్థులు ఉన్నారు. యంత్ర మానవ సాంకేతికతకు సంబంధించిన ప్రాథమిక అంశాలు, విద్యుత్ భాగాలు, స్పందన పరికరాలు, విద్యుత్ చలన యంత్రాలు, విద్యుత్ వలయాల నిర్మాణం, యంత్ర మానవ భాగాల వినియోగం, బోధనా పద్ధతులు, తరగతి నిర్వహణ, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహణ వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా విద్యార్థులు స్వయంగా పలు యంత్ర మానవ నమూనాలను రూపొందించి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సమర్థంగా బోధించే విధానాలను అభ్యసించారు. ఈ కార్యక్రమం ద్వారా వారు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నాయకత్వ లక్షణాలు, సంభాషణ నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యం, బృంద సమన్వయ నైపుణ్యాలను కూడా పెంపొందించుకున్నారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న విద్యార్థులకు పాల్గొన్నట్లు ధ్రువపత్రాలు అందజేసి, త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న యంత్ర మానవ శిక్షణ కార్యక్రమాల్లో శిక్షకులుగా సేవలందించేందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ అవకాశం ద్వారా విద్యార్థులు సమాజానికి సేవ చేయడంతో పాటు విలువైన శిక్షణా అనుభవాన్ని కూడా పొందుతారని నిర్వాహకులు పేర్కొన్నారు.

# కరీంనగర్‌లో 18 వాహనాలు సీజ్

**256 ట్రాఫిక్ కేసులు.. రూ.78,930 జరిమానా.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు: అడిషనల్ డీసీపీ**




కరీంనగర్, ఆగస్టు 6 (ఈవార్తలు): శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ క్రమశిక్షణను పటిష్ఠం చేసేందుకు కరీంనగర్ పోలీసు కమిషనరేట్ బుధవారం టౌన్, రూరల్ డివిజన్ల పరిధిలో భారీ ఎత్తున ప్రత్యేక నాకాబందీ నిర్వహించింది. ప్రధాన కూడళ్లు, బస్ స్టాండ్‌లు, జాతీయ రహదారులు, సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 256 ఈ-చలాన్ కేసులు నమోదు చేసి రూ.78,930 జరిమానా విధించారు. ఇందులో 251 ద్విచక్ర వాహనాలు, 5 నాలుగు చక్రాల వాహనాలపై చర్యలు తీసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 18 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా, సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 18 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదనంగా 4 ఈ-పెట్టీ కేసులు నమోదు చేశారు. చొప్పదండి పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 80 కేసులు నమోదు చేసి రూ.16,365 జరిమానా విధించారు. గీతాభవన్ జంక్షన్‌లో 34 కేసులు, రామ్‌నగర్ సిగ్నల్ వద్ద 31 కేసులు, మంచిర్యాల చౌరస్తాలో 27 కేసులు నమోదు కాగా, ఎన్‌టిఆర్ జంక్షన్, కేబుల్ బ్రిడ్జ్, బస్ స్టాండ్ సర్కిల్, ఎన్జీఓఎస్ కాలనీ, నాకా చౌరస్తా, ఎస్ఆర్ఆర్ కళాశాల జంక్షన్, బీఆర్ఆర్ ఎల్ఎండీ, గంగధర, మల్లాపూర్, మానకొండూర్, గన్నేరువరం తదితర ప్రాంతాల్లోనూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ, వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడం, అవసరమైన పత్రాలు లేకుండా ప్రయాణించడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రత్యేక నాకాబందీ తనిఖీలు ఇకపై కూడా నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## కూకట్‌పల్లిలో ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు




కూకట్‌పల్లి, ఆగస్టు 6 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్‌లో ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టుముక్కల జస్వంత్‌రావు (దేశల్) జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జస్వంత్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటిచెప్పడంలో, ఉద్యమానికి దిశానిర్దేశం చేయడంలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప విద్యావేత్త, మేధావి, ఉద్యమకారుడిగా ఆయనను కొనియాడారు. జయశంకర్ ఆశయాలు, విలువలు, నిబద్ధత నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాసేవ లక్ష్యాల సాధనకు ఆయన చూపిన మార్గం ఎల్లప్పుడూ ఆదర్శప్రాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు, దేశల్ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

## కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్‌లో ఘనంగా వనమహోత్సవం



వేములవాడ అర్బన్, ఆగస్టు 6 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టణ వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. ర్యాలీ అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పలు రకాల నీడనిచ్చే, పూల మొక్కలను నాటారు. అలాగే విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించగా, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ దరక్షణ్ వస్ఫియా మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చెట్ల పెంపకం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హసన్ ఫసి ఉల్లాహ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రానికి రోల్ మోడల్‌గా చొప్పదండి: మేడిపల్లి సత్యం

గంగాధర, ఆగస్టు 6 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. గురువారం గంగాధర మండలం మధురానగర్‌లో ఆర్డీవో షర్మిలతో కలిసి ప్రభుత్వ స్థలాలను ఆయన పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు మధురానగర్‌లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేటాయించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గంగాధర రెవెన్యూ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములను పూర్తిస్థాయిలో గుర్తించి నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రాము, ఏపీఎం కుమారస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల కోత వద్దు

**జీవో 1181 ఉపసంహరించుకోవాలని సీఎంకు జీవన్ రెడ్డి లేఖ**

జగిత్యాల, ఆగస్టు 6 (ఈవార్తలు): రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో కోత విధించిన జీవో నం.1181ను తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎంకు లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పారిశుద్ధ్య నిర్వహణతో పాటు కార్యాలయ విధులు నిర్వహిస్తూ మున్సిపాలిటీల అభివృద్ధికి కీలకంగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిన సమయంలో ప్రభుత్వం వేతనాల్లో కోత విధించడం ఉద్యోగుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల తగ్గింపుతో కుటుంబ పోషణ, పిల్లల విద్య, వైద్య ఖర్చులు భరించడం ఉద్యోగులకు భారంగా మారుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని స్పష్టం చేసినప్పటికీ ప్రభుత్వం జీవో 1181 ద్వారా వేతనాలు తగ్గించడం సరికాదన్నారు. జీవోను వెంటనే రద్దు చేసి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు మార్కెట్ ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

## చిరు వ్యాపారులకు శాశ్వత స్థలం ఏర్పాటు చేయాలి: ఎంఐఎం



జగిత్యాల టౌన్, ఆగస్టు 6 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో రహదారి విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ, పట్టణ సుందరీకరణ పనుల కారణంగా తొలగించబడిన చిరు వ్యాపారులకు శాశ్వత ప్రత్యామ్నాయ స్థలం కల్పించి, వారి జీవనోపాధిని పరిరక్షించాలని కోరుతూ ఎంఐఎం నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ సత్య ప్రవీణ్కు వినతిపత్రం అందజేశారు. జగిత్యాల పట్టణ ఎంఐఎం అధ్యక్షుడు సుమీర్ ఉద్దీన్ ఆజాద్, మున్సిపల్ కౌన్సిలర్ రజి ఉద్దీన్, కౌన్సిలర్ డాక్టర్ అయ్యూబ్ ఖాన్, ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు అనేక సంవత్సరాలుగా చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు విక్రయించే వ్యాపారులు, టిఫిన్ బండ్లు తదితర చిరు వ్యాపారులు తమ కుటుంబాల జీవనోపాధి కోసం వ్యాపారాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి పనుల్లో భాగంగా వీరిని తొలగించినప్పటికీ, ఇప్పటివరకు శాశ్వత ప్రత్యామ్నాయ స్థలం లేదా పునరావాసం కల్పించలేదని తెలిపారు. దీంతో సుమారు 2,000 మందికి పైగా చిరు వ్యాపారులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రోజువారీ ఆదాయంపైనే ఆధారపడే పేద కుటుంబాల జీవనం సంక్షోభంలో పడిందని వివరించారు. తొలగించబడిన వ్యాపారులకు శాశ్వతంగా వ్యాపారం చేసుకునేందుకు అనువైన స్థలాన్ని కేటాయించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ పునరావాస పథకాలు, ఆర్థిక సహాయం, ఇతర సంక్షేమ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పత్రాలు లేని వాహనాలపై రవాణా శాఖ కొరడా

**10 వాహనాలు సీజ్, కేసులు నమోదు**

జగిత్యాల, ఆగస్టు 6 (ఈవార్తలు): జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిలోని ఆర్టీసీ బస్సు డిపో సమీపంలో జిల్లా రవాణా అధికారి సందాని ఆధ్వర్యంలో, మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సాయి చరణ్ ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ట్యాక్స్, ఫిట్‌నెస్, పర్మిట్ తదితర చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా నడుపుతున్న వాహనాలపై చర్యలు తీసుకున్నారు. మొత్తం 10 కేసులు నమోదు చేసి, సంబంధిత వాహనాలను సీజ్ చేశారు. వీటిలో మూడు మోటార్ క్యాబ్‌లు, మూడు గూడ్స్ వాహనాలు, రెండు ట్రాక్టర్లు, రెండు త్రీ వీలర్ గూడ్స్ క్యారేజ్ వాహనాలు ఉన్నాయి. వాహనదారులు తప్పనిసరిగా అన్ని చట్టబద్ధమైన పత్రాలతోనే వాహనాలు నడపాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణా అధికారి సందాని హెచ్చరించారు.

## దళితులపై కుల వివక్షను అరికట్టాలి

**అంబేద్కర్ యువజన మండలి**

జగిత్యాల, ఆగస్టు 6 (ఈవార్తలు): ఆధునిక సాంకేతిక యుగంలోనూ దళితులపై కుల వివక్ష కొనసాగడం దురదృష్టకరమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన మండలి అధ్యక్షుడు గంగాధర ప్రవీణ్ అన్నారు. ఇటీవల నారాయణపూర్ గ్రామంలో దళిత మహిళా సర్పంచ్‌ను గ్రామసభలో అవమానించడం, మానసిక వేధింపులకు గురిచేయడం, ఆమె కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దళితులపై జరుగుతున్న దాడులు, అవమానాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఘటనపై ప్రభుత్వం, పోలీసు అధికారులు వెంటనే స్పందించి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు రక్షణ, న్యాయం కల్పించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగాల దుర్గయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## దళిత సర్పంచ్‌పై దాడి హేయం

**బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం**

గంగాధర, ఆగస్టు 6 (ఈవార్తలు): గంగాధర మండలం నారాయణపూర్ గ్రామ సర్పంచ్ భర్త ధీకొండ మధుపై జరిగిన దాడిని మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మండల ప్రజా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. గ్రామ సభలో తీర్మానం చేసినంత మాత్రాన ముంపు గ్రామ సమస్యలు పరిష్కారం కావని, అలాంటి అవకాశం ఉంటే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమస్య ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి దళిత సర్పంచ్ ఎన్నికైన నాటి నుంచి బీఆర్ఎస్ నాయకులు రాజకీయ అసూయతో ప్రజలను రెచ్చగొడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దళితులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికవడాన్ని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. నారాయణపూర్ రిజర్వాయర్ పనుల్లో 90 శాతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పూర్తయ్యాయని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మిగిలిన పనులు పూర్తి చేయలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిధులు మంజూరు చేసి మిగిలిన పనులు చేపడుతుండగా, వాటిని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేకు, స్థానిక సర్పంచ్‌కు మంచి పేరు వస్తుందనే రాజకీయ అసూయతోనే దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దాడి ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రొమాల రమేష్, మాజీ జెడ్పీటీసీ గునుకొండ బాబు, సర్పంచ్‌లు పడాల భాగ్యలక్ష్మి రాజన్న, వేముల భాస్కర్, దాసరి శంకరయ్య, రాచమల్ల రవి, బాసవేని శ్రీనివాస్, కోలేపాక కవిత మల్లేష్, బీర్ల ఆనంద్, గుండవేని లావణ్య తిరుపతి, చిందం ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు అత్తపురం తిరుపతి, దాతు అంజి, పెంచాల చందు, కదారి కుమారస్వామి, కముటం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మల్యాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహణ

మల్యాల, ఆగస్టు 6 (ఈవార్తలు): మల్యాల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి బొట్ల జయ ప్రసాద్ అధ్యక్షతన, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. శిశువు పుట్టిన గంటలోపు వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) అత్యంత పోషక విలువలు కలిగి ఉంటాయని, వాటిలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే గుణాలు అధికంగా ఉంటాయని వివరించారు. పుట్టిన శిశువుకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వీరలక్ష్మి, ఉపసర్పంచ్ కటకం వినయ్ కుమార్, వార్డు సభ్యులు, సూపర్వైజర్ శారద, హెల్త్ సీహెచ్‌వో జ్యోతి, హెల్త్ సూపర్వైజర్ రమణమ్మ, ఈఓ శ్రీకాంత్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, ఇతర తల్లులు, యువకులు పాల్గొన్నారు.

# బంకీపూర్ బుల్లెట్.. మేల్కొనాలి బీజేపీ

## ఓటములు, నిరసనలు, యువత ప్రశ్నలు.. 2047 లక్ష్యం ముందు అసలు పరీక్షలు

**(శ్రీశైలం దూడం, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)**

రాజకీయాల్లో కొన్ని సంఘటనలు కేవలం ఒక రోజు వార్తలుగా మిగిలిపోవు. అవి భవిష్యత్ రాజకీయాలకు సంకేతాలుగా మారుతాయి. బీహార్‌లోని బంకీపూర్ ఉపఎన్నిక ఫలితం కూడా అలాంటి రాజకీయ సందేశాన్ని ఇచ్చింది. బలమైన పునాదులు ఉన్న నియోజకవర్గంలో అధికార పార్టీకి ఎదురైన పరాజయం ప్రజల మనసును అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేసింది. బంకీపూర్ బీజేపీకి ఒక ఓటమి మాత్రమే కాదు... ప్రజల అంచనాలు, యువత ఆకాంక్షలు, పాలనపై ఉన్న అభిప్రాయాలను పరిశీలించాల్సిన సందర్భం. అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం నిరంతర ప్రక్రియ. ఒకసారి వచ్చిన విజయం శాశ్వత హామీ కాదని ప్రజాస్వామ్యం ప్రతి ఎన్నికలో గుర్తు చేస్తూనే ఉంటుంది. బంకీపూర్ నియోజకవర్గం చాలాకాలంగా బీజేపీకి అనుకూల ప్రాంతంగా భావించబడింది. అక్కడ వచ్చిన మార్పు రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది. కొత్త రాజకీయ శక్తులు, కొత్త నినాదాలు, స్థానిక సమస్యలపై దృష్టి పెట్టిన ప్రచారం ఓటర్లను ప్రభావితం చేయగలదని ఈ ఫలితం సూచించింది. ప్రజలు ఇప్పుడు కేవలం భావోద్వేగాలపై కాకుండా తమ జీవితాలకు సంబంధించిన అంశాలపై స్పందిస్తున్నారు. ఉద్యోగాలు, విద్య, ఆర్థిక అవకాశాలు, భవిష్యత్ భద్రత వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాల్లో కీలకంగా మారుతున్నాయి. ఇటీవల దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, సామాజిక కార్యకర్తల నిరసనలు వివిధ అంశాలపై చర్చకు దారి తీశాయి. విద్యా వ్యవస్థ, పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలు వంటి విషయాల్లో యువతలో ఉన్న ఆందోళనలు రాజకీయ పార్టీలకు ఒక సవాల్‌గా మారాయి. నేటి యువత ప్రశ్నించే తరం. హామీలు మాత్రమే కాదు, వాటి అమలు ఎలా జరుగుతోందన్నదే గమనిస్తోంది. భవిష్యత్‌పై భరోసా కల్పించే విధానాలు, పారదర్శక నిర్ణయాలు, అవకాశాల కల్పనపై యువత దృష్టి పెరిగింది.

రాజకీయ పార్టీలకు కొన్ని సందర్భాల్లో చిన్న పరాజయాలు కూడా పెద్ద పాఠాలు నేర్పుతాయి. ఉపఎన్నికల్లో ఎదురయ్యే ఫలితాలు, ప్రజా నిరసనలు, సామాజిక వర్గాల అసంతృప్తి..ఇవన్నీ ప్రజల మనసులో జరుగుతున్న మార్పులకు సంకేతాలుగా ఉంటాయి. అధికార పార్టీకి మాత్రమే కాదు, ప్రతి రాజకీయ సంస్థకు ప్రజలతో నిరంతర అనుసంధానం అవసరం. ప్రజల సమస్యలను వినడం, వాటిపై స్పందించడం, పాలనలో విశ్వాసాన్ని పెంచడం ఏ ప్రభుత్వానికైనా ప్రధాన బాధ్యత. భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే లక్ష్యం ముందుకు సాగుతోంది. ఈ లక్ష్యం ఏ ఒక్క పార్టీకి మాత్రమే సంబంధించినది కాదు. దేశంలోని అన్ని వ్యవస్థలు, ప్రభుత్వాలు, ప్రజల భాగస్వామ్యంతో సాధించాల్సిన దీర్ఘకాల ప్రయాణం. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు. యువతకు అవకాశాలు, నాణ్యమైన విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, పారదర్శక పాలన కూడా అంతే ముఖ్యమైనవి. ప్రజల విశ్వాసం ఉన్నప్పుడే ఏ ప్రభుత్వం అయినా దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించగలదు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి రాజకీయ పార్టీ ముందున్న అతిపెద్ద పరీక్ష.



**సింహం వెనక్కి అడుగు...**

**ఆత్మపరిశీలనకు అవకాశం**

రాజకీయాల్లో ఒక పరాజయం అంతిమం కాదు. సింహం నాలుగు అడుగులు వెనక్కి వేస్తే అది భయంతో కాదు... తన తదుపరి అడుగును మరింత బలంగా వేయడానికి సిద్ధమవుతున్నట్టే. అయితే ఆ బలం ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం ద్వారా రావాలి. ప్రజల తీర్పును గౌరవించడం, లోపాలను సరిదిద్దుకోవడం, కొత్త తరంతో అనుసంధానం కావడం ద్వారా మాత్రమే రాజకీయ బలం పెరుగుతుంది. బంకీపూర్ బుల్లెట్ ఇచ్చిన సందేశం ఇదే. అధికారం కన్నా ప్రజల విశ్వాసం గొప్పది. ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న వారికే భవిష్యత్ రాజకీయాల్లో స్థానం ఉంటుంది. 2047 దిశగా భారత ప్రయాణంలో ప్రజాస్వామ్య విలువలు, అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యమే అసలైన బలమైన పునాది.

## డీలిమిటేషన్ బిల్లుకు మద్దతివ్వండి

**రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి రిజిజు ఫోన్**

**మిత్రపక్షాలతో చర్చించి నిర్ణయం చెబుతానన్న రాహుల్**

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఫోన్ చేసి నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ అంశంపై రాహుల్ గాంధీతో రిజిజు మాట్లాడటం ఇది మూడోసారి అని తెలుస్తోంది. బిల్లుకు ప్రతిపక్షం సహకరిస్తే మహిళా రిజర్వేషన్ల అమలు వేగవంతమవుతుందని ఆయన వివరించినట్లు సమాచారం. లేదంటే మహిళల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని కూడా రిజిజు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ అంశంపై రాహుల్ గాంధీ ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదని సమాచారం. ముందుగా కాంగ్రెస్ మిత్రపక్షాలు, ఇండియా కూటమి భాగస్వాములతో చర్చించి తర్వాత పార్టీ వైఖరిని వెల్లడిస్తామని రిజిజుకు చెప్పినట్లు తెలిసింది. అయితే డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఆ పార్టీ ఎంపీ కే.సి. వేణుగోపాల్ బుధవారం స్పష్టం చేశారు. గత పార్లమెంట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని చెప్పారు. బడ్జెట్ సమావేశాల సమయంలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందలేదు. మహిళా రిజర్వేషన్ల పేరుతో దేశ రాజకీయ, జనాభా సమీకరణాలను మార్చే ప్రయత్నం జరుగుతోందనే ఆందోళనతోనే బిల్లును వ్యతిరేకించినట్లు కాంగ్రెస్ గతంలో తెలిపింది. అయితే ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల పరిధిలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే మద్దతు ఇస్తామని కాంగ్రెస్ ఇప్పటికే స్పష్టం చేసింది.



## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం పెట్టుబడిదారుల సెంటిమెంట్‌కు ఊతమిచ్చింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రసాయన రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పైకి ఎగిశాయి. సెన్సెక్స్ 374 పాయింట్లు లాభపడి 78,954.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 11.35 పాయింట్లు పెరిగి 24,636 వద్ద స్థిరపడింది. నిఫ్టీ షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారత్ ఎలక్ట్రానిక్స్ అత్యధిక లాభాలు నమోదు చేశాయి. మరోవైపు రియల్టీ, మీడియా, ఆటో రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మిడ్‌క్యాప్ సూచీ 0.44 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.48 శాతం లాభపడింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రసాయన రంగ షేర్లు మాత్రం మార్కెట్ కంటే మెరుగైన ప్రదర్శన కనబర్చాయి. విశ్లేషకుల అంచనా ప్రకారం నిఫ్టీకి 24,600 పాయింట్ల స్థాయి తక్షణ మద్దతుగా ఉండనుంది. ఆ తర్వాత 24,500 పాయింట్ల వద్ద బలమైన మద్దతు లభించే అవకాశం ఉందని చెబుతున్నారు. అలాగే 24,700 పాయింట్ల వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు. ముడి చమురు ధరలు తగ్గడం భారత్‌కు అనుకూల పరిణామమని మార్కెట్ నిపుణులు అంటున్నారు. దిగుమతి వ్యయం తగ్గడంతో పాటు ద్రవ్యోల్బణ ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉండటంతో మార్కెట్ సెంటిమెంట్‌కు ఇది మద్దతుగా నిలిచిందని విశ్లేషిస్తున్నారు.

## విద్యార్థులతో రాహుల్ సభకు అనుమతి రద్దు

**యూపీలో రాజకీయ దుమారం**

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులతో నిర్వహించనున్న 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం చుట్టూ రాజకీయ వివాదం చెలరేగింది. ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో జరగాల్సిన సభకు ఇచ్చిన అనుమతిని చివరి నిమిషంలో రద్దు చేయడంతో కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేపీ గ్రౌండ్ నిర్వహణ బాధ్యతలు చూసే కాయస్థ పాఠశాల ట్రస్ట్.. భారీ వర్షాలు, భద్రతా పరిస్థితులు, కోర్టు ఆదేశాల కారణంగానే అనుమతి వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. అయితే ఇది బీజేపీ ప్రభుత్వ ఒత్తిడితో తీసుకున్న నిర్ణయమేనని కాంగ్రెస్ ఆరోపించింది. విద్యార్థులతో రాహుల్ గాంధీ మాట్లాడకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ విమర్శించారు. కోటా, డెహ్రాడూన్ తర్వాత ఇప్పుడు ప్రయాగ్‌రాజ్‌లోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొందని అన్నారు. ఎలాంటి అడ్డంకులు వచ్చినా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యవహారంపై ప్రియాంక గాంధీ కూడా స్పందించారు. "ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదు" అని వ్యాఖ్యానించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా హసన్ కూడా ఈ నిర్ణయాన్ని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందని, అలాంటి కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రభుత్వ బలహీనతకు నిదర్శనమని అన్నారు.



# మూతపడుతున్న మగ్గం

అప్పుల బాధ..

ఉపాధి కొరత

మార్కెట్‌లో సంక్షోభం

మనుగడ కోసం పోరాటం

## చేనేతకు చీకటి రోజులు



**ఈవార్తలు - స్పెషల్ బ్యూరో**

తెలుగు రాష్ట్రాల్లో చేనేత రంగం మరోసారి తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. తరతరాలుగా మగ్గం మీద జీవితం నడిపిన కుటుంబాలు నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఉపాధి లేక, మార్కెట్ దెబ్బతో మనుగడ కోసం పోరాడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా రాజన్న సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట, వరంగల్ సహా ఏపీలోని మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, చీరాల వంటి చేనేత కేంద్రాల్లో పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. గత మూడు సంవత్సరాల్లో ఆత్మహత్యలపై వేర్వేరు సంఖ్యలు ప్రచారంలో ఉన్నప్పటికీ, ప్రభుత్వం విడుదల చేసిన సమగ్ర రాష్ట్రవ్యాప్త అధికారిక గణాంకాలు అందుబాటులో లేవు. అందువల్ల ఖచ్చితమైన సంఖ్యను పేర్కొనడం కంటే, నమోదైన ఘటనలు, అధికారిక స్పందనలు, చేనేత సంఘాల ఆందోళనల ఆధారంగా సమస్య తీవ్రతను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. 2024లో మాత్రమే సిరిసిల్లలో పలువురు నేతన్నలు ఆత్మహత్యలు చోటుచేసుకోగా, ప్రభుత్వం కొన్ని కేసులను మాత్రమే అధికారికంగా గుర్తించి పరిహారం పరిశీలనకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.

**సిరిసిల్లలో వినిపిస్తున్న మౌన కేక**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అప్పులు, ఉపాధి కొరత కారణంగా పలువురు నేయుగాళ్లు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు వెలుగుచూశాయి. ఒక కార్మికుడు ఆరు నెలలుగా పని లేక, కుటుంబ అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇలాంటి ప్రతి మరణం వెనుక ఒక కుటుంబం, పిల్లల చదువు, వృద్ధ తల్లిదండ్రుల ఆశలు, నిలిచిపోయిన మగ్గం ఉంటాయి. చేనేత సంక్షోభం ఒక్కరోజులో రాలేదు. ఇది సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్య. ప్రభుత్వాలు ప్రకటించే పథకాలు ఉన్నప్పటికీ అమలు, మార్కెట్ అనుసంధానం, ఆదాయ భద్రతలో ఇంకా పెద్ద లోటు ఉందని నిపుణులు చెబుతున్నారు. చేనేత కుటుంబాలకు ఇప్పటికిప్పుడు స్థిరమైన ఉపాధి, కనీస ఆదాయ భరోసా, తక్కువ వడ్డీ రుణాలు, మార్కెటింగ్ మద్దతు, ముడిసరుకు సబ్సిడీ, సామాజిక భద్రత అందించాల్సిన అవసరం ఉంది. ఆత్మహత్య జరిగిన తర్వాత పరిహారం ప్రకటించడం కన్నా, ఆ పరిస్థితి రాకుండా చేయడమే అసలు సంక్షేమం. గతంలో ప్రభుత్వ కొనుగోలు పథకాలు, ముఖ్యంగా బతుకమ్మ చీరల వంటి కార్యక్రమాలు వేలాది నేతన్నలకు నిరంతర ఉపాధిని కల్పించాయని అధికారిక నివేదికలు పేర్కొన్నాయి. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం చేనేత నేతన్నల వార్షిక ఆదాయాన్ని ₹5-6 లక్షలకు పెంచే లక్ష్యంతో సాంకేతిక కేంద్రాలు, ఆధునికీకరణ చర్యలను ప్రకటించింది. కానీ అవి గ్రామస్థాయిలో ఎంత వేగంగా ఫలితాలిస్తాయన్నది కీలకం.

**చట్టాలు ఉన్నా.. ప్రయోజనమేది?**

ఇటీవల తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ శాఖలు సాధ్యమైనంత వరకు చేనేత ఉత్పత్తులను సహకార వ్యవస్థ ద్వారా కొనుగోలు చేయాలనే ప్రభుత్వ విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేస్తూ ఇచ్చిన తీర్పు చేనేత రంగానికి ఊరటనిచ్చింది. ప్రభుత్వ కొనుగోళ్లు నేయుగాళ్ల జీవనాధారానికి ఎంత ముఖ్యమో ఈ తీర్పు మరోసారి గుర్తు చేసింది. చేనేత చీరలో కేవలం నూలు ఉండదు. ఒక కళాకారుడి శ్రమ, ఒక కుటుంబం ఆశ, ఒక ప్రాంతపు గుర్తింపు, ఒక నాగరికత చరిత్ర అల్లుకుని ఉంటాయి. తెలంగాణలో పోచంపల్లి ఇకత్, గద్వాల్ చీర, నారాయణపేట నేయ్యు, సిరిసిల్ల వస్త్ర సంప్రదాయం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఈ సంపదను నిలబెట్టాలంటే కేవలం జాతీయ చేనేత దినోత్సవం రోజున ప్రశంసలు చెప్పడం సరిపోదు. సంవత్సరం పొడవునా స్థిరమైన విధానాలు, మార్కెట్ భరోసా, నేతన్నకు గౌరవప్రదమైన ఆదాయం అవసరం.

## మగ్గం నడిస్తేనే ఇంట్లో పొయ్యి




తెలంగాణలో చేనేత కేవలం ఒక వృత్తి కాదు. అది ఒక సంస్కృతి. ఒక కుటుంబ వ్యవస్థ. వేలాది కుటుంబాలకు జీవనాధారం. రాష్ట్ర చేనేత-జౌళి శాఖ వివరాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 59,325 మంది చేనేత నేతన్నలు, అనుబంధ కార్మికులు, 407 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. చేనేత ఉత్పత్తులకు నిరంతర ఆర్డర్లు లేకపోవడం ప్రధాన సమస్య. ప్రభుత్వ కొనుగోళ్లు తగ్గినప్పుడు మగ్గాలు నెలల తరబడి ఆగిపోతున్నాయని నేయుగాళ్లు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో బతుకమ్మ చీరల వంటి ప్రభుత్వ ఆర్డర్లు నిలిచిపోవడం ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపిందని సంఘాలు ఆరోపిస్తున్నాయి. నూలు, రంగులు, విద్యుత్, రవాణా ఖర్చులు పెరిగాయి. కానీ చేనేత వస్త్రాల ధర అంతగా పెరగలేదు. బ్యాంకు రుణాలు అందక ప్రైవేట్ అప్పులపై ఆధారపడాల్సి వస్తోంది. పవర్‌లూమ్, యంత్రాల తయారీ వస్త్రాలు తక్కువ ధరకే అందుబాటులోకి రావడంతో చేతి మగ్గం ఉత్పత్తులు పోటీ పడలేకపోతున్నాయి. ఆన్‌లైన్ మార్కెట్‌లోనూ చాలామంది నేయుగాళ్లకు ప్రత్యక్ష ప్రాప్యత లేదు. రోజుకు గంటల కొద్దీ కష్టపడినా ఆదాయం పరిమితంగానే ఉండటంతో కొత్త తరం ఈ వృత్తిని కొనసాగించడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో సంప్రదాయ నైపుణ్యాలే కనుమరుగయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

## ఢిల్లీ హైకోర్టుకు డాబర్

**'100%' క్లెయిమ్‌పై ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలపై సవాల్**

న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ డాబర్ ఇండియా లిమిటెడ్, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జారీ చేసిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. తమ ఉత్పత్తులపై '100 శాతం' వంటి ప్రకటనలను వినియోగించరాదంటూ ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇచ్చిన ఆదేశాలను కంపెనీ వ్యతిరేకించింది. ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలని కంపెనీ తరఫున సీనియర్ న్యాయవాది సందీప్ సేథి కోరగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ధర్మాసనం అందుకు అంగీకరించింది. ఆగస్టు 3న ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, డాబర్‌కు చెందిన పలు ఉత్పత్తులపై ఉన్న '100 శాతం సహజ సిద్ధం', '100 శాతం స్వచ్ఛం', '100 శాతం ఆర్గానిక్' వంటి ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని పేర్కొంది. ఈ క్రమంలో తేనె, యాపిల్ సైడర్ వెనిగర్, నెయ్యి, కొబ్బరి నూనె, కొబ్బరి నీళ్లు వంటి ఉత్పత్తుల విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. ఈ క్లెయిమ్స్ అస్పష్టంగా ఉండటంతో పాటు, ఆహార భద్రతా ప్రమాణాల నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేసింది. కొన్ని ఉత్పత్తులపై సరైన ధ్రువీకరణ లేకుండా 'జైవిక్ భారత్' లోగోను వినియోగించడాన్ని కూడా తప్పుబట్టింది. ఈ ఆదేశాలపై స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించిన డాబర్, తమ ఉత్పత్తుల లేబుల్స్ చట్టబద్ధమైన నిబంధనలకు లోబడే ఉన్నాయని స్పష్టం చేసింది. ఇది కేవలం ఉత్పత్తి వివరణకు సంబంధించిన అంశమే తప్ప, నాణ్యతకు సంబంధించినది కాదని పేర్కొంది. ఒక బాధ్యతాయుతమైన సంస్థగా, '100 శాతం' క్లెయిమ్స్ లేని కొత్త లేబుల్స్‌కు ఇప్పటికే మారుతున్నామని, ఈ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే న్యాయపరమైన సలహా మేరకు డాబర్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు త్వరలోనే విచారణ చేపట్టనుంది.



వయ్యారి చిత్రం






## మళ్లీ కొత్తగా రామాయణ
# ట్రైలర్ 100 కోట్ల వ్యూస్

**బాలీవుడ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ రామాయణ ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో హైలెట్ అవుతోంది. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యష్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా దీపావళికి థియేటర్లలోకి రానుంది. వారం క్రితం జూలై 30న రిలీజైన ఈ మూవీ ట్రైలర్ ఒక క్యూరియాసిటీని క్రియేట్ చేసింది.**

ఇక వచ్చిన రెస్పాన్స్ చూసి ఇండస్ట్రీ జనాలు షాక్ అవుతున్నారు. ట్రైలర్ రిలీజైన కేవలం వారం రోజుల్లోనే ఏకంగా 100 కోట్ల వ్యూస్ మార్క్ దాటేసింది. ఇండియన్ సినిమాలో ఒక ట్రైలర్ కు ఈ రేంజ్ లో బిలియన్ వ్యూస్ రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఈ వీడియోను ఊహించని స్థాయిలో షేర్ చేయడంతో ప్రతి ప్లాట్‌ఫామ్ లో ఇదే గట్టిగా ట్రెండ్ అయింది. ఈ బిలియన్ వ్యూస్ రికార్డు సెలబ్రేషన్స్ లో భాగంగా మేకర్స్ గురువారం ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ ట్రైలర్ ను ఏఐ ఎన్హాన్స్ లిప్ సింక్ టెక్నాలజీతో అప్‌డేట్ చేసి మళ్లీ ఆడియన్స్ ముందుకు తెచ్చారు. ఏఐ టెక్నాలజీ ఉపయోగించి ఆర్టిస్టుల డైలాగ్స్ కి తగ్గట్టుగా పెదాల కదలికలను సెట్ చేశారు. మొదట ట్రైలర్ పై కొంత టాక్ భిన్నంగా ఉన్నప్పటికీ ఇప్పుడు పర్ఫెక్ట్ గా మరో లెవెల్లో హైలెట్ అయ్యింది. సాధారణంగా వేరే భాషల్లోకి డబ్ చేసినప్పుడు మాటలు ఒకలా, పెదాల మూమెంట్స్ ఇంకోలా కనిపిస్తుంటాయి. కానీ ఈ ఏఐ టెక్నాలజీ వల్ల ఆ ప్రాబ్లమ్ కవర్ అయింది. ఏ లాంగ్వేజ్ లో చూసినా సరే, ఆ నటీనటులు సొంతంగా అదే భాష మాట్లాడినట్లే చాలా నాచురల్ గా అనిపిస్తోంది. డబ్బింగ్ ఫీలింగ్ అస్సలు రావడం లేదు అనే కామెంట్స్ వస్తున్నాయి. ఈ కొత్త ఏఐ వర్క్ చూసిన ఆడియన్స్ నుంచి సోషల్ మీడియాలో మంచి కాంప్లిమెంట్స్ వస్తున్నాయి. 100 కోట్ల వ్యూస్ తో ఊపు మీదున్న ఈ రామాయణ ప్రాజెక్ట్ దీపావళికి రిలీజ్ అయ్యాక ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## ప్యారడైజ్ టీచర్..
# అరాచకం

టాలీవుడ్ అగ్ర హీరో నేచురల్ స్టార్ నాని వరుస విజయాలతో దూసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ది ప్యారడైజ్ సినిమా చేస్తున్నాడు. కయాదు లోహర్ హీరోయిన్ గా చేస్తున్న ఈ మూవీలో... కలెక్షన్ కింగ్ మోహన్ బాబు స్పెషల్ రోల్ చేస్తున్నారు. రాఘవ్ జుయల్ కూడా ఇందులో మెరుస్తున్నారు. ఎస్ఎల్ వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ఆయా షేర్ సాంగ్ అందరినీ



ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాట మారుమోగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్ వదిలారు. ఇందులో నాని యాక్టింగ్ అరాచకంగా ఉంది. అయితే ఈ టీజర్ పైన భిన్న అభిప్రాయాలు వస్తున్నాయి. కొంత మంది బాగుందని చెబుతుంటే... మరికొంతమంది గందరగోళంగా ఉందని పోస్టులు పెడుతున్నారు. వయోలెన్స్ డామినేషన్ ఉన్న టీజర్ లో డైలాగులు సరిగ్గా అర్థం కావడం లేదని విమర్శలు చేస్తున్నారు. చాలా చోట్ల డైలాగ్స్ ను బ్యాగ్రౌండ్ మ్యూజిక్ ఓవర్ టెక్ చేసిందని స్పష్టం చేస్తున్నారు. టీజర్ సౌండ్ విషయంలో కనీస జాగ్రత్తలు కూడా తీసుకోలేదా ? అని మేకర్స్ ను నిలదీస్తున్నారు. ఈ టీజర్ అర్థం కాక తలలు పట్టుకున్నట్లు మరికొందరు రియాక్ట్ అవుతున్నారు.


## ఫ్యామిలీతో రష్మిక రెస్ట్

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోతున్న రష్మికా మందన్నా సినిమాలకు బ్రేక్ ఇచ్చి కుటుంబంతో సమయం గడుపుతున్నారు. నిరంతరం షూటింగ్‌లు, విమాన ప్రయాణాలు, బిజీ షెడ్యూళ్లతో తీరికలేకుండా గడిపే నేషనల్ క్రష్‌కు చిన్నపాటి గాయం .. అనారోగ్యం కారణంగా విరామం దొరికింది. కెరీర్ పరంగా ఎంతో బిజీగా ఉన్న ఈ భామకు ఆరోగ్య సమస్య ఒకరకంగా తన కుటుంబంతో కలిసి ఉండే సువర్ణావకాశాన్ని తెచ్చిపెట్టింది. వ్యాపారాలు, కోట్ల రూపాయల పారితోషికాలు, స్టార్‌డమ్ ఎంత ఉన్నప్పటికీ కుటుంబంతో గడిపే ఆనందం ముందు అవేవీ సరిపోవని రష్మిక అనుభూతి చెందుతున్నారు. ఉరుకులు పరుగుల జీవితంలో కుటుంబ సభ్యులకు దూరం అయిన అమ్మడు ఇప్పుడు పూర్తిగా ఇంటి పట్టునే ఉంటూ ఆనందంగా గడుపుతున్నారు. ఎంత సంపాదించినా దొరకని మానసిక ప్రశాంతత కుటుంబంతో గడిపే క్షణాల వల్లే సాధ్యమవుతుందని ఈ విరామం ద్వారా రష్మిక తెలుసుకుంటున్నారు.



## బరి.. నిర్మాతగా నిహారిక

పరిశ్రమలో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నిహారిక కొణిదెల సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్‌గా ప్రస్థానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి సంకల్పించారు. మెగా కుటుంబం నుంచి వచ్చినా ఇండస్ట్రీలో తనకంటూ స్వతంత్ర గుర్తింపును సంపాదించుకోవాలనే లక్ష్యంతోనే అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పలు వైవిధ్యమైన ప్రాజెక్ట్‌లతో నిర్మాతగా సత్తా చాటిన అమ్మడు కెరీర్‌లో రాబోతున్న కొత్త చిత్రం ఓ మైలురాయిగా నిలవనుంది. గతంలో -కమిటీ కుర్రాళ్లు-, -రాకాస- వంటి విభిన్న చిత్రాలతో పాటు పలు ఆకర్షణీయమైన వెబ్ సిరీస్‌లను నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌లన్నీ ఎక్కువగా పరిమిత బడ్జెట్‌తో కొత్త టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ రూపొందించినవే. నూతన నటీనటులు .. సాంకేతిక నిపుణులను పరిచయం చేస్తూ అమ్మడు చేసిన ప్రయోగాలు మంచి విజయాన్ని అందుకున్నాయి.





## టాలీవుడ్‌కు శ్రీలీల గుడ్ బై?



టాలీవుడ్ అగ్ర హీరోయిన్ శ్రీలీల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పెళ్లి సందడి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ అందాల తార... ఆ తర్వాత వరుసగా పెద్ద హీరోలతో సినిమాలు చేసి సక్సెస్ అయ్యారు. వరుసగా అవకాశాలను దక్కించుకుంటున్న శ్రీలీలకు మరో బంపర్ ఆఫర్ తగిలినట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. సూపర్ స్టార్ రజినీకాంత్ సినిమాలో శ్రీలీలకు అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. సడన్ గా ఓ తమిళ హీరోయిన్ హ్యాండ్ ఇవ్వడంతో ఆ అవకాశం... ఈమెకు వచ్చినట్లు చెబుతున్నారు. దీనిపై త్వరలోనే మేకర్స్ అధికారిక ప్రకటన కూడా చేసే అవకాశాలు కనిపిస్తున్నట్లు టాక్. కొంత కాలంగా హీరోయిన్ శ్రీలీల టాలీవుడ్ ఇండస్ట్రీలో కొత్త సినిమా అవకాశాలు వచ్చినప్పటికీ..ఒప్పుకోవడం లేదు. ఈ సంవత్సరం ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ అయినప్పటికీ... గత రెండు సంవత్సరాల కిందటే, ఈ ప్రాజెక్ట్ కు ఆమె సైన్ చేశారు. అంటే ఈ మధ్య టాలీవుడ్ ఇండస్ట్రీలో ఏ ఒక్క సినిమాకు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదన్నమాట. భవిష్యత్తులో బాలీవుడ్ తో పాటు కోలీవుడ్ ఇండస్ట్రీలో ఎక్కువగా సినిమాలు చేసేలా శ్రీలీల అడుగులు వేస్తున్నట్లు టాక్ నడుస్తోంది.

## మహేశ్‌తో సయ్యాట కోసం



సూపర్ స్టార్ మహేష్ తో మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోవడానికి బాలీవుడ్ భామ కృతి సనన్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ విషయాన్ని అమ్మడు స్వయంగా వెల్లడించారు. దీంతో ఈ వార్త నెట్టింట వైరల్ గా మారింది. మహేష్‌తో జతకట్టే అవకాశం వస్తే ఎలాంటి పాత్రలోనైనా నటించడానికి సిద్ధంగా ఉన్నానని మనసులోని మాటను బయటపెట్టారు. మహేష్ గనుక ఆమె కోరికను మన్నించి ఛాన్స్ ఇస్తే అది రెండవ సారి అవుతుంది. వివరాల్లోకి వెళ్తే. మహేష్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన -1 నేనొక్కడినే- సినిమాతోనే కృతి సనన్ కథానాయికగా టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంలో అమ్మడి నటనకు మంచి గుర్తింపు వచ్చినా బాక్సాఫీస్ వద్ద ఆ సినిమా ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేదు. ఆ సమయంలో తానొక నటిగా పరిశ్రమకు పూర్తిగా కొత్త అని కెరీర్ ఆరంభంలో సరైన అవగాహన లేని చిన్న పిల్లను అంటూ నాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తొలి సినిమా చేసే సమయంలో నటనపై, ఇండస్ట్రీ పద్ధతులపై పెద్దగా అనుభవం లేకపోవడం వల్ల మహేష్ లాంటి స్టార్ హీరోతో పని చేస్తున్నప్పుడు చాలా విషయాలు గ్రహించలేకపోయానని కృతి తెలిపారు.



## ఆర్సీ 17లో రుక్మిణి

తెలుగు సినీ అభిమానులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో రామ్ చరణ్--సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా ఒకటి. ఈ చిత్రాన్ని 'ఆర్సీ17' అనే వర్కింగ్ టైటిల్‌తో ఇప్పటికే అధికారికంగా ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ రాలేదు. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ పనులు మరికొంత కాలం కొనసాగనున్న నేపథ్యంలో షూటింగ్ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం. అయితే ఈ చిత్రానికి హీరోయిన్‌ను మాత్రం మేకర్స్ దాదాపు ఖరారు చేసినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం వినిపిస్తున్న వార్తల ప్రకారం, రామ్ చరణ్‌కు జోడీగా కన్నడ నటి రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆమెతో సంప్రదింపులు కూడా జరిపినట్లు ప్రచారం జరుగుతుంది. అన్ని అనుకున్నట్లు జరిగితే ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా కనిపించే అవకాశాలు ఉన్నాయని టాక్. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# గిల్‌కు గాయం.. తొలి టెస్టుకు డౌటే!

శ్రీలంకతో మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌కు ముందు భారత టెస్టు జట్టుకు స్వల్ప ఆందోళన ఎదురైంది. కొలంబోలో గురువారం జరిగిన ప్రాక్టీస్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కుడి చేతికి రెండుసార్లు గాయమైంది. అయితే ప్రాథమిక పరీక్షల్లో అది అంత తీవ్రమైనదేమీ కాదని తేలడంతో జట్టు ఊపిరి పీల్చుకుంది. మొదట నెట్ ప్రాక్టీస్‌లో ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ బంతి గిల్ కుడి బొటనవేలికి బలంగా తాకింది. వెంటనే వైద్య సిబ్బంది వచ్చి చికిత్స అందించారు. బొటనవేలికి బ్యాండేజ్ వేసిన తర్వాత గిల్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగారు. ఆ తర్వాత స్పిన్ బౌలర్లను కూడా ఎదుర్కొంటూ సాధన కొనసాగించారు. అక్కడితో ఇబ్బంది ముగియలేదు. తర్వాత స్లిప్ క్యాచింగ్ ప్రాక్టీస్‌లో మరోసారి కుడి చేతికి బంతి బలంగా తాకింది. దీంతో కొద్దిసేపు సాధన ఆపి ఐస్ ప్యాక్ పెట్టుకున్నారు. అనంతరం మళ్లీ ప్రాక్టీస్ పూర్తి చేశారు. ఎలాంటి ఫ్రాక్చర్ లేదని వైద్య బృందం స్పష్టం చేసినట్లు సమాచారం. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానున్న వేళ ఈ ఘటన భారత జట్టులో కాస్త ఆందోళన కలిగించింది. ఇప్పటికే గాయాల కారణంగా సిరీస్‌కు బుమ్రా దూరమయ్యాడు. వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా కూడా అందుబాటులో లేరు. సాయి సుదర్శన్ కాలివేలు గాయం నుంచి కోలుకుంటూ బెంగళూరులోనే ఉన్నాడు. ఈ పరిస్థితుల్లో గిల్ పూర్తిస్థాయిలో ఫిట్‌గా ఉండటం జట్టుకు ఎంతో కీలకం. వార్మప్ మ్యాచ్‌లో గిల్ బరిలోకి దిగే అవకాశమే ఉన్నా.. ఫీల్డింగ్ సమయంలో అతనిపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల టెస్టుల్లో అద్భుత ఫామ్‌లో ఉన్న గిల్.. గత 10 మ్యాచుల్లో 1,109 పరుగులు చేసి ఆరు సెంచరీలు నమోదు చేశారు. శ్రీలంక పిచ్‌లకు అలవాటు పడేందుకు ఈ వార్మప్ మ్యాచ్ అతనికి కీలకంగా మారనుంది.

# పీవీ సింధు అకాడమీకి రెండోసారి భూమిపూజ



తన బ్యాడ్మింటన్ అకాడమీకి రెండోసారి భూమిపూజ నిర్వహించడంపై వస్తున్న విమర్శలకు స్టార్ షట్లర్ పీవీ సింధు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తన కలల ప్రాజెక్టును సరికొత్తగా పునఃప్రారంభిస్తున్న తరుణంలో, తనకు అత్యంత ఆప్తులైన వారు పక్కన ఉండాలనే ఉద్దేశంతోనే మరోసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు స్పష్టం చేశారు. ఈ వేడుకకు మంత్రి నారా లోకేశ్ హాజరుకావడం తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. తొలిసారి నిర్వహించిన భూమిపూజ కేవలం ఏడు గంటల వ్యవధిలో అత్యంత వేగంగా జరిగిందని సింధు తన ట్వీట్‌లో వివరించారు. ఆ సమయంలో తన కుటుంబ సభ్యులతో పాటు సన్నిహితులు, గ్రీన్‌కో ప్రతినిధులు అనిల్, స్వాతి వంటి శ్రేయోభిలాషులు హాజరుకాలేకపోయారని గుర్తుచేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంతో ఈ ప్రాజెక్టు పరిధిని మరింతగా విస్తరించినట్లు వెల్లడించారు. కేవలం బ్యాడ్మింటన్ అకాడమీకే పరిమితం కాకుండా, క్రీడలు, విద్యను మేళవించే ఒక సమగ్ర విద్యా సంస్థగా దీనిని తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు సింధు తెలిపారు. ఈ బృహత్తర ఆశయాన్ని ప్రారంభించే సమయంలో తనకు అండగా నిలిచిన వారందరూ తోడుండాలని ఆకాంక్షించినట్లు చెప్పారు. 2028 ఒలింపిక్స్ లక్ష్యంగా ఇకపై పనులను మరింత వేగవంతం చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



# పిడుగుపాటుతో ఫుట్‌బాల్ ఆటగాడి మృతి

థాయ్‌లాండ్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడుతుండగా పిడుగుపడటంతో 24 ఏళ్ల సోఫ్వాన్ అవే అనే యువ ఆటగాడు ప్రాణాలు కోల్పోయాడు. మంగళవారం దక్షిణ థాయ్‌లాండ్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో మరో 12 మంది ఆటగాళ్లు కూడా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నిర్వాహకులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. గోలోక్ ఎఫ్‌ఏ కప్ అనే స్థానిక టోర్నమెంట్‌లో భాగంగా సోఫ్వాన్ అవే ఆడుతున్న శామ్‌కోల్ట్స్ జట్టు, అబూ ఎక్స్ నాంగ్ సిరిన్ జట్టు మధ్య మ్యాచ్ జరుగుతోంది. వర్షం పడుతున్నా ఆట కొనసాగుతుండగా, ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మైదానంలో పిడుగుపడింది. పిడుగుపాటుకు సోఫ్వాన్ నేలపై కుప్పకూలిపోయాడు. వెంటనే సహచర ఆటగాళ్లు, సిబ్బంది అతని వద్దకు పరుగెత్తారు. కానీ, అప్పటికే అతను కదలిక లేకుండా పడి ఉన్నాడు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ చీఫ్ థున్ సిరిఖుంత్ మాట్లాడుతూ.. "సంఘటనా స్థలంలో అత్యవసర వైద్య బృందాలు అతడిని కాపాడేందుకు అన్ని విధాలా ప్రయత్నించాయి.



# టీమిండియా వుమెన్.. కొత్తగా టీ20 సిరీస్

**భారత మహిళల క్రికెట్ జట్టు డిసెంబర్ 2026లో చేపట్టనున్న దక్షిణాఫ్రికా పర్యటనకు సంబంధించి కీలకమైన మార్పు చోటుచేసుకుంది. ముందుగా ఖరారైన షెడ్యూల్‌కు అదనంగా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను జోడించినట్లు క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్‌ఏ) అధికారికంగా ప్రకటించింది. 2027 ఫిబ్రవరిలో శ్రీలంక వేదికగా జరగనున్న తొలి ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి జట్లను సన్నద్ధం చేసే లక్ష్యంతో ఈ టీ20 సిరీస్‌ను చేర్చినట్లు సీఎస్ఏ స్పష్టం చేసింది.**

ఈ పర్యటన డిసెంబర్ 9 నుంచి 30 వరకు జరగనుంది. ఈ మార్పుతో, పర్యటన చివర్లో టీ20 సిరీస్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 26న బెనోనిలోని విల్లోమూర్ పార్క్‌లో పండుగ వాతావరణంలో 'బాక్సింగ్ డే' టీ20 మ్యాచ్ జరగనుంది. మిగిలిన రెండు టీ20 మ్యాచ్‌లు డిసెంబర్ 29, 30 తేదీలలో పోచెఫ్‌స్ట్రూమ్‌లోని ఎన్‌డబ్ల్యూసీ ఓవల్‌లో జరుగుతాయి. ఈ పర్యటన తొలుత డిసెంబర్ 9 నుంచి 12 వరకు గెబెర్హాలోని సెయింట్ జార్జ్ పార్క్‌లో ఏకైక టెస్టు మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. ఈ టెస్టు అనంతరం ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. ఈ వన్డేలు ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్ లో భాగం. డిసెంబర్ 16 నుంచి 22 వరకు పార్ల్, కేప్ టౌన్, బ్లూమ్‌ఫోంటెయిన్ నగరాలు ఈ వన్డే మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తాయి. ఈ సవరించిన షెడ్యూల్‌పై క్రికెట్ సౌతాఫ్రికా సీఈఓ ఫోలెట్సీ మొసెకీ హర్షం వ్యక్తం చేశారు. "భారత పర్యటనకు టీ20 సిరీస్‌ను జోడించడం సంతోషంగా ఉంది. పండుగ సీజన్‌లో జరిగే ఈ మ్యాచ్‌లు, వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీకి మా ప్రోటీస్ మహిళల జట్టు సన్నద్ధతకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రపంచ క్రికెట్‌లో భారత్ అత్యంత బలమైన జట్లలో ఒకటి. అలాంటి జట్టుతో మూడు ఫార్మాట్లలో తలపడటం మాకు విలువైన అనుభవాన్ని ఇస్తుంది," అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో టీ20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాలో ఐదు టీ20ల సిరీస్‌లో పాల్గొంది. అయితే, ఆ సిరీస్‌ను 1-4 తేడాతో కోల్పోయింది. ఇప్పుడు ఈ కొత్త సిరీస్‌తో ఆ ఓటమికి బదులు తీర్చుకునే అవకాశం భారత జట్టుకు లభించింది.

**సవరించిన పూర్తి షెడ్యూల్:**

ఏకైక టెస్టు: డిసెంబర్ 9 - 12: గెబెర్హా
వన్డే సిరీస్:
1వ వన్డే: డిసెంబర్ 16, పార్ల్ (ఉదయం 10 గంటలకు)
2వ వన్డే: డిసెంబర్ 19, కేప్ టౌన్ (మధ్యాహ్నం 2 గంటలకు)
3వ వన్డే: డిసెంబర్ 22, బ్లూమ్‌ఫోంటెయిన్ (మధ్యాహ్నం 2 గంటలకు)
టీ20 సిరీస్: 1వ టీ20: డిసెంబర్ 26, బెనోని (సాయంత్రం 6 గంటలకు)
2వ టీ20: డిసెంబర్ 29, పోచెఫ్‌స్ట్రూమ్ (సాయంత్రం 6 గంటలకు)
3వ టీ20: డిసెంబర్ 30, పోచెఫ్‌స్ట్రూమ్ (సాయంత్రం 6 గంటలకు)



# బట్లర్ ప్రపంచ రికార్డ్

## నా రికార్డులు వైభవ్ బద్దలు కొడతాడు: బట్లర్



ఇంగ్లండ్ విధ్వంసకర బ్యాటర్, కెప్టెన్ జోస్ బట్లర్ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డును తన పేరున లిఖించుకున్నాడు. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న వెస్టిండీస్ దిగ్గజం కీరన్ పొలార్డ్‌ను అధిగమించి టీ20 పరుగుల రారాజుగా అవతరించాడు. ఇంగ్లండ్‌లో జరుగుతున్న 'ది హండ్రెడ్' లీగ్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్న బట్లర్, వెల్ష్ ఫైర్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ చారిత్రక మైలురాయిని అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో బట్లర్ కేవలం 20 బంతుల్లోనే 2 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 51 పరుగులు చేసి తన జట్టును గెలిపించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను టీ20ల్లో మొత్తం 14,833 పరుగుల మార్కును చేరుకున్నాడు. ఇప్పటివరకు 746 మ్యాచ్‌ల్లో 14,803 పరుగులతో పొలార్డ్ అగ్రస్థానంలో ఉండగా, బట్లర్ కేవలం 522 మ్యాచ్‌ల్లోనే ఈ రికార్డును బద్దలుకొట్టడం విశేషం. ఈ జాబితాలో యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ (463 మ్యాచ్‌ల్లో 14,562 పరుగులు) మూడో స్థానంలో ఉన్నాడు. బట్లర్ తన టీ20 కెరీర్‌లో ఇప్పటివరకు 9 సెంచరీలు, 105 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. ఈ ఘనత సాధించిన అనంతరం బట్లర్ స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేశాడు. "టీ20ల్లో అందరికంటే ఎక్కువ పరుగులు చేయడం గొప్ప అనుభూతినిస్తోంది. ఇది గర్వకారణమైన క్షణం. భవిష్యత్తులో ఎవరో ఒకరు ఈ రికార్డును అధిగమిస్తారు. అతడు బహుశా సూర్యవంశీ కావచ్చు" అని సరదాగా వ్యాఖ్యానించాడు. "క్రికెట్ ఎంత వేగంగా మారిపోతుందో చెప్పలేం.

# వైభవ్‌తో ఇప్పుడే టెస్ట్ క్రికెట్ వద్దు: రహానే

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై ఒత్తిడి తీసుకురావద్దని క్రికెట్ పండిట్స్‌కు మాజీ క్రికెటర్ అజింక్యా రహానే సూచించాడు. అతను ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నాడని, కాస్త సమయం ఇవ్వాలని సూచించాడు. ఇప్పుడే టెస్ట్ క్రికెట్ కూడా ఆడించవద్దని హితవు పలికాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా నిలిచినప్పటి నుంచి వైభవ్ టాక్ ఆఫ్ ది క్రికెట్ వరల్డ్‌గా మారాడు. ఈ ప్రదర్శనతో టీమిండియాకు ఎంపికైన వైభవ్.. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో అరంగేట్రం చేశాడు. భారత్ తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచాడు. ఈ సిరీస్‌లో విఫలమైనా జింబాబ్వే పర్యటనలో సత్తా చాటి తన ప్రతిభను చాటుకున్నాడు. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్యా రహానే తాజాగా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా వైభవ్ సూర్యవంశీ గురించి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ సూర్యవంశీ టెస్ట్ కెరీర్ గురించి ఇప్పుడే చెప్పడం కష్టమన్నాడు. అతనికి కాస్త సమయం ఇవ్వాలని, అనవసర ఒత్తిడి తీసుకురావద్దని అభిప్రాయపడ్డాడు. 'నా మాటలతో వైభవ్‌పై ఒత్తిడి తీసుకురావాలనుకోవడం లేదు. ఎందుకంటే ఇప్పటికే జనాలు అతని గురించి చాలా మాట్లాడుతున్నారు. ఇది కేవలం రెండు ఐపీఎల్ సీజన్లు మాత్రమే. నేను గ్రహించిన విషయం ఏంటంటే.. ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్ పూర్తిగా భిన్నమైనది. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఐపీఎల్‌లో 4, 5 ఓవర్లలో 70 పరుగులను సునాయసంగా ఛేజ్ చేయవచ్చు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లో అలా చేయడం చాలా కష్టం. కాబట్టి వైభవ్‌ను తన ఆట తనను ఆడనివ్వండి. ఎదగనివ్వండి.'అని రహానే చెప్పుకొచ్చాడు.



# ధోనీ గది తెరిచే ఉంటుంది: రహానే

టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ చాలా ప్రశాంతమైన, సాధారణ వ్యక్తి అని, సహచర ఆటగాళ్ల కోసం అతని గది తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని సీనియర్ క్రికెటర్ అజింక్యా రహానే అన్నాడు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రహానే, ధోనీతో తనకున్న అనుబంధాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నాడు. రహానే మాట్లాడుతూ.. "ధోనీ చాలా కూల్, అందరిలాగే ఓ సాధారణ మనిషి. అతని గది తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. చాలాసార్లు మేం 10 నుంచి 15 మంది, కొన్నిసార్లు జట్టు మొత్తం ఆయన గదిలోనే ఉండేవాళ్లం. అయితే, అతని గది తలుపు మూసి ఉంటే మాత్రం ఎవరూ లోపలికి వెళ్లే సాహసం చేసేవారు కాదు" అని గుర్తుచేసుకున్నాడు. రహానే తన అంతర్జాతీయ అరంగేట్రం (టెస్టు, వన్డే, టీ20) ధోనీ కెప్టెన్సీలోనే చేయడం, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కూడా కలిసి ఆడటం గమనార్హం. ఇదే సందర్భంగా తాను సిరీస్‌ల సమయంలో మానసిక ప్రశాంతత కోసం సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉండేవాడినని రహానే వెల్లడించాడు. "సిరీస్ జరుగుతున్నప్పుడు నేను అన్ని సోషల్ మీడియా యాప్‌లను డిలీట్ చేస్తాను. 2017లో ఐపీఎల్‌లో కలిసి ఆడినప్పుడు ఇంగ్లండ్ ఆటగాడు బెన్ స్టోక్స్ ఈ సలహా ఇచ్చాడు. అప్పటినుంచి దీన్ని పాటిస్తున్నా" అని చెప్పాడు. గదిలో ఉన్నప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో ఏదైనా చూడటం, పుస్తకాలు చదవడం, కుటుంబంతో మాట్లాడటం వంటివి చేయడం ద్వారా మానసికంగా ఉల్లాసంగా ఉండేవాడినని రహానే వివరించాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ప్రజాస్వామ్యానికి కొత్త ఊపిరి

ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం భారత్. దేశ జనాభాలో గణనీయమైన భాగం 35 ఏళ్లలోపు వారే. ఈ యువశక్తి దేశానికి గొప్ప ఆస్తి. అయితే ఈ శక్తి కేవలం ఉద్యోగాలు, విద్య, సాంకేతికతకే పరిమితమైతే సరిపోదు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే యువత రాజకీయ చైతన్యంతో ముందుకు రావాలి. ఓటు వేయడం నుంచి విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై స్పందించడం, చివరికి నాయకత్వ బాధ్యతలు చేపట్టడం వరకు యువత పాత్ర విస్తరించాలి. దురదృష్టవశాత్తు, మన దేశంలో రాజకీయాలను ఇప్పటికీ చాలామంది యువకులు "మురికి కాలువ"గా చూస్తున్నారు. మంచి చదువు చదివినవారు, ప్రతిభావంతులు, నైతిక విలువలు కలిగినవారు రాజకీయాలకు దూరంగా ఉండటాన్ని గొప్పగా భావిస్తున్నారు. అదే సమయంలో రాజకీయాలను వృత్తిగా మార్చుకున్న కొందరు ప్రజాస్వామ్యాన్ని తమ స్వప్రయోజనాలకు వేదికగా మార్చుకుంటున్నారు. ఈ పరిస్థితి మారాలంటే యువత రాజకీయాలపై దృక్పథం మారాలి. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి చేతిలో ఉన్న గొప్ప ఆయుధం ఓటు. కానీ ఎన్నికల రోజు సెలవుగా భావించి ఓటు వేయకుండా ఇంట్లోనే ఉండే యువత ఇప్పటికీ తక్కువ కాదు. మరికొందరు కులం, మతం, ప్రాంతం, డబ్బు, తాత్కాలిక ప్రలోభాల ఆధారంగా ఓటు వేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. ఓటు అనేది ఐదేళ్ల పాలనను నిర్ణయించే శక్తి. కాబట్టి అభ్యర్థి వ్యక్తిత్వం, ప్రజాసేవ, పనితీరు, విధానాలు, నిజాయితీ వంటి అంశాలను పరిశీలించి ఓటు వేయడం యువత బాధ్యత కావాలి. నేటి యువత రాజకీయ సమాచారాన్ని ఎక్కువగా సామాజిక మాధ్యమాల ద్వారానే పొందుతోంది. ఇది ఒకవైపు మంచి పరిణామమే అయినా, మరోవైపు అసత్య ప్రచారం, దుష్ప్రచారం, కృత్రిమ మేధస్సుతో తయారయ్యే నకిలీ వీడియోలు, తప్పుడు కథనాలు యువత అభిప్రాయాలను ప్రభావితం చేస్తున్నాయి. ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్‌లను చూసి నిర్ణయాలు తీసుకోవడం కాదు; వాస్తవాలను పరిశీలించి, విభిన్న అభిప్రాయాలను వినిపించి, విమర్శనాత్మకంగా ఆలోచించే రాజకీయ అవగాహన యువతలో పెరగాలి. ప్రజాస్వామ్యంలో మంచి పౌరుడు అంటే కేవలం ఓటు వేసే వ్యక్తి కాదు. ఎన్నికల తర్వాత కూడా ప్రజా ప్రతినిధులను ప్రశ్నించే, ప్రభుత్వ పనితీరును పరిశీలించే, ప్రజా సమస్యలపై స్పందించే వ్యక్తి. రోడ్లు, విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధి, అవినీతి వంటి అంశాలపై ప్రశ్నించడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం. యువత ప్రశ్నిస్తేనే పాలకుల్లో బాధ్యత పెరుగుతుంది. ప్రశ్నించే స్వరాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ప్రతి ఎన్నికలో యువత ఓట్లు కీలకం. కానీ అభ్యర్థుల జాబితాలో యువతకు అవకాశాలు మాత్రం పరిమితంగానే ఉంటాయి. రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవడం, కుటుంబ రాజకీయాలు, డబ్బు ప్రభావం, ఎన్నికల ఖర్చు వంటి కారణాలు కొత్త నాయకత్వాన్ని వెనక్కి నెడుతున్నాయి. యువతను కేవలం ప్రచారానికి, సోషల్ మీడియా బృందాలకు మాత్రమే పరిమితం చేయకుండా, నిర్ణయాత్మక స్థానాల్లోనూ అవకాశాలు కల్పించాలి. నాయకత్వం వయసుతో కాదు, సామర్థ్యంతో రావాలి. రాజకీయాలు అంటే అధికారం కాదు; బాధ్యత. పదవి కాదు; ప్రజాసేవ. ఈ భావన బలపడినప్పుడే సమాజానికి మంచి నాయకత్వం లభిస్తుంది. యువత కూడా రాజకీయాల్లోకి రావాలంటే అధికారమే లక్ష్యం కాకుండా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలి. కళాశాలలు కేవలం ఉద్యోగాల కోసం విద్యార్థులను తయారు చేయడం సరిపోదు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, పౌర బాధ్యతలు, ఎన్నికల ప్రాముఖ్యత, ప్రజా విధానాలపై అవగాహన కల్పించాలి. చర్చలు, మాక్ పార్లమెంట్‌లు, విధాన విశ్లేషణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించవచ్చు. నేటి ప్రపంచం వేగంగా మారుతోంది. కృత్రిమ మేధస్సు, వాతావరణ మార్పు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, స్టార్టప్‌లు, సైబర్ భద్రత వంటి కొత్త సవాళ్లను అర్థం చేసుకునే నాయకత్వం అవసరం. యువత ఈ అంశాలపై మంచి అవగాహన కలిగి ఉంటుంది ఆలోచనలు విధాన నిర్ణయాల్లో ప్రతిబింబించినప్పుడే పాలన కాలానుగుణంగా మారుతుంది.

భారత అత్యున్నత న్యాయస్థానం అంటే దేశ ప్రజలకు చివరి ఆశాకిరణం. రాజ్యాంగ పరిరక్షణకు, పౌర హక్కుల రక్షణకు, ప్రభుత్వాల నిర్ణయాలను రాజ్యాంగ బద్ధంగా సమీక్షించడానికి సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన వ్యవస్థ. అయితే దేశంలోని ప్రతి పౌరుడికి ఆ న్యాయస్థానం అందుబాటులో ఉందా? న్యాయం అందరికీ సమానంగా చేరుతోందా? అనే ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం దొరకడం లేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రజల పరిస్థితిని పరిశీలిస్తే, సుప్రీంకోర్టు ఢిల్లీలో మాత్రమే ఉండటం వల్ల న్యాయం పొందడం సామాన్యుడికి భారంగా మారుతోంది. ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026ను రాజ్యసభ ఆమోదించడం స్వాగతించదగ్గ పరిణామం.



# హైదరాబాద్‌కు సుప్రీం బెంచ్ అత్యవసరం

పెరుగుతున్న కేసుల భారం దృష్ట్యా న్యాయమూర్తుల సంఖ్య పెరగడం అవసరమే. కానీ న్యాయమూర్తుల సంఖ్య పెరగడమే సరిపోదు. న్యాయాన్ని ప్రజలకు భౌగోళికంగా కూడా చేరువ చేయాల్సిన అవసరం ఉంది. అదే నేపథ్యంలో హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు శాశ్వత ధర్మాసనం (బెంచ్) ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మళ్లీ బలంగా వినిపిస్తోంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంచడం మంచి నిర్ణయమే. కానీ దక్షిణాది ప్రజలకు నిజమైన న్యాయం అందాలంటే హైదరాబాద్‌లో శాశ్వత సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడం అత్యవసరం. న్యాయాన్ని ప్రజలకు చేరువ చేయకుండా కేవలం న్యాయమూర్తుల సంఖ్య పెంచితే సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-130 ప్రకారం సుప్రీంకోర్టు ఢిల్లీలోనే కాకుండా, రాష్ట్రపతి అనుమతితో భారత ప్రధాన న్యాయమూర్తి సూచించే ఇతర ప్రాంతాల్లో కూడా సమావేశం కావడానికి రాజ్యాంగం అవకాశం కల్పించింది. అంటే శాశ్వత బెంచ్‌ల ఏర్పాటుకు రాజ్యాంగ పరంగా ఎలాంటి అడ్డంకి లేదు. అయినప్పటికీ స్వాతంత్ర్యం వచ్చిన దాదాపు ఎనిమిది దశాబ్దాల తర్వాత కూడా ఢిల్లీ వెలుపల ఒక్క శాశ్వత సుప్రీంకోర్టు బెంచ్ కూడా లేకపోవడం ఆశ్చర్యకరం. దేశం అభివృద్ధి చెందింది. రాష్ట్రాలు పెరిగాయి. జనాభా విపరీతంగా విస్తరించింది. కేసుల సంఖ్య లక్షల నుంచి కోట్లకు చేరుకుంది. కానీ న్యాయ వ్యవస్థలో భౌగోళిక వికేంద్రీకరణ మాత్రం జరగలేదు. దీని ప్రభావం ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రజలపై తీవ్రంగా పడుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రాంతాల ప్రజలు ప్రతి ముఖ్యమైన కేసు కోసం వేల కిలోమీటర్లు ప్రయాణించి ఢిల్లీ వెళ్లాల్సి వస్తోంది. ప్రయాణ ఖర్చులు, న్యాయవాదుల ఫీజులు, వసతి ఖర్చులు కలిపి లక్షల రూపాయల భారం పడుతోంది. సామాన్య రైతు, కార్మికుడు, విద్యార్థి, ఉద్యోగి సుప్రీంకోర్టు వరకు వెళ్లాలంటే ఎంతో ఆర్థిక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇది కేవలం దూరం సమస్య మాత్రమే కాదు. ఇది న్యాయం అందుబాటులో ఉండే హక్కుకు సంబంధించిన అంశం. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన న్యాయం హామీ ఇస్తే, ఆ న్యాయాన్ని పొందేందుకు భౌగోళికంగా, ఆర్థికంగా అసమాన పరిస్థితులు ఎందుకు కొనసాగాలి? ఈ ప్రశ్నకు ప్రభుత్వం, న్యాయవ్యవస్థ రెండూ సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.

హైదరాబాద్ నగరం దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన మహానగరాల్లో ఒకటి. అత్యాధునిక రవాణా వ్యవస్థ, అంతర్జాతీయ విమానాశ్రయం, జాతీయ రహదారులు, రైల్వే అనుసంధానం, ఆధునిక న్యాయ మౌలిక సదుపాయాలు, ఉన్నత న్యాయవాదుల సేవలు, విస్తృత పరిపాలనా సామర్థ్యం వంటి అన్ని అంశాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. భౌగోళికంగా కూడా దక్షిణాది రాష్ట్రాలకు ఇది కేంద్ర స్థానంలో ఉంది. హైదరాబాద్ దక్షిణ భారతదేశానికి సహజ న్యాయ కేంద్రంగా మారే అన్ని అర్హతలు కలిగి ఉంది. ఇక్కడ సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తే కోట్లాది ప్రజలకు న్యాయం చేరువ అవుతుంది. ఇది కేవలం తెలంగాణకే కాదు, మొత్తం దక్షిణ భారతదేశానికి ఉపయోగపడే నిర్ణయం అవుతుంది. ఈ డిమాండ్ కొత్తది కాదు. అనేక దశాబ్దాలుగా న్యాయవాదుల సంఘాలు, న్యాయ నిపుణులు, ప్రజా ప్రతినిధులు దక్షిణాదిలో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నారు. పార్లమెంటులో కూడా ఈ అంశం పలుమార్లు ప్రస్తావనకు వచ్చింది. అయినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం విచారకరం. మరోవైపు, న్యాయవ్యవస్థలో కీలక భాగస్వాములైన న్యాయవాదుల సంక్షేమంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. న్యాయవ్యవస్థకు న్యాయవాదులే వెన్నుముక. ప్రజలకు న్యాయం అందించడంలో వారి పాత్ర అమూల్యం. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా వృత్తిలోకి అడుగుపెట్టే ప్రతి నూతన న్యాయవాదికి ఆరోగ్య భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రస్తుతం కొత్తగా నమోదు చేసుకుంటున్న ఎంతోమంది యువ న్యాయవాదులకు ఆరోగ్య కార్డులు అందడం లేదు. ఇది వారి కుటుంబాలకు కూడా ఆందోళన కలిగించే అంశం. వెంటనే అందరికీ ఆరోగ్య కార్డులు జారీ చేయాలి.

న్యాయవాది అంటే కేవలం కోర్టులో వాదనలు వినిపించే వ్యక్తి మాత్రమే కాదు. రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యత ఆయనపై ఉంటుంది. అలాంటి వృత్తిలోకి వచ్చే యువ న్యాయవాదులకు కనీస ఆరోగ్య భద్రత కూడా లేకపోవడం సంక్షేమ రాష్ట్రానికి తగిన విషయం కాదు. నేటి పరిస్థితుల్లో న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడాలంటే న్యాయం అందుబాటులో ఉండాలి. న్యాయ ప్రక్రియ వేగవంతం కావాలి. ప్రజలపై ఖర్చు భారం తగ్గాలి. ఈ లక్ష్యాల సాధనకు హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు అత్యంత సముచితమైన నిర్ణయంగా నిలుస్తుంది. దేశంలో సమాన న్యాయం గురించి మాట్లాడే ప్రతి ప్రభుత్వం, ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి రాజ్యాంగ సంస్థ ఇప్పుడు ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. దక్షిణాది ప్రజలకు న్యాయం నిజంగానే సమానమైతే... సుప్రీంకోర్టు బెంచ్ ఇప్పటికీ ఢిల్లీ గడప దాటకపోవడానికి కారణం ఏమిటి? హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు శాశ్వత ధర్మాసనం ఏర్పాటు చేయడం ప్రాంతీయ అభివృద్ధి కోసం కాదు; రాజ్యాంగం హామీ ఇచ్చిన న్యాయ సమానత్వాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి అవసరమైన చారిత్రక అడుగు.



నవీన్ పోగుల
న్యాయవాది. 9885443909

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.